
## గ్రీన్ ఫీల్డ్ రైతుల సమస్యల పరిష్కారానికి మంత్రికి వినతి



వివరాలు మెయిన్‌లో...


# ప్రజాపక్షం
# జిల్లా అనుబంధం

హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

ఆదివారం | 07 జూన్, 2026 | పేజీలు :08


# పేదల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం కృషి

**ప్రజాపక్షం/ములుగు/హనుమకొండటౌన్ :** పేదల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని అర్హులైన అందరికి సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందిస్తున్నామని, భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తున్నామని, వడ్డీలేని రుణాలు, ఉపాధి అవకాశాల ద్వారా మహిళలు స్వయం సమృద్ధి సాధిస్తున్నారని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క తెలిపారు. 99 రోజుల ప్రజాపాలన...ప్రగతి ప్రణాళికలో భాగంగా శనివారం ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం బూర్గుపేట గ్రామంలోని ఆశ్రమ పాఠశాల ఆవరణంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక ప్రజా దర్బార్ కార్యక్రమంలో బూర్గుపేట, లక్ష్మీపురం, చక్రవర్తిపల్లి, అడవి రంగాపూర్, మల్లయ్యపల్లి గ్రామాల ప్రజల నుండి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టోప్పోతో కలిసి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం, భూ సమస్యల పరిష్కారం, మహిళల ఆర్థిక సాధికారత లక్ష్యంగా అనేక సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. గతంలో రేషన్ కార్డుల కోసం ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని, అర్హత కలిగిన కుటుంబాలకు కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేసి సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని కూడా విజయవంతంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. భూ భారతి కార్యక్రమంలో భాగంగా వెంకటాపూర్ మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి భూ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టామని తెలిపారు. రామచంద్రపురం ప్రాంతంలో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సుమారు 10వేల ఎకరాల భూములకు సంబంధించిన సర్వే ప్రక్రియ పూర్తయిందని, అర్హులైన రైతులకు త్వరలోనే పట్టాలు అందజేయనున్నట్లు



వెల్లడించారు. తిమ్మాపురం, పట్వారిపల్లె ప్రాంతాల భూ సమస్యలను కూడా త్వరితగతిన పరిష్కరించేలా అధికారులకు ఆదేశాలు ఇచ్చామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, సంపత్‌రావు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, పంచాయతీరాజ్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి, స్థానిక ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, మండల తహసీల్దారు, ఎంపిడిఓ, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### అభివృద్ధి పనులను ప్రారంభం

ములుగు టౌన్‌లో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో సిఆర్‌ఆర్ 2025–26 నిధులతో పలు అభివృద్ధి పనులకు శనివారం శంకుస్థాపన చేసి ప్రారంభించారు. ములుగు టౌన్ పరిధిలో జాతీయ రహదారి 163 నుండి ఎరుకలవాడ వరకు రూ.6 కోట్ల 50లక్షల వ్యయంతో రోడ్డు విస్తరణ, డివైడర్, సెంట్రల్ లైటింగ్ నిర్మాణ పనులకు, జాతీయ రహదారి 163 నుండి ఎస్‌సి కాలనీ వరకు రూ.5కోట్ల 75లక్షల వ్యయంతో రోడ్డు విస్తరణ, డివైడర్, సెంట్రల్ లైటింగ్ నిర్మాణ పనులకు, అలాగే ములుగు టౌన్ తూర్పు భాగంలో రూ.5కోట్ల 95లక్షల వ్యయంతో అంతర్గత సిసి రోడ్లు, డ్రైన్ నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, మున్సిపల్ చైర్‌పర్సన్ చింతనిప్పుల చంద్రకళ, వైస్ చైర్‌పర్సన్ ఆసియా షాహీన్, కౌన్సిలర్లు, స్థానిక ప్రజా ప్రతినిధులు, కోఆప్షన్ సభ్యులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

**అర్హులందరికీ సంక్షేమ పథకాల అమలు* భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం* వడ్డీ లేని రుణాలు, ఉపాధి అవకాశాలతో మహిళల స్వయం సమృద్ధి: మంత్రి సీతక్క**



### గడ్డం కేశవమూర్తికి మంత్రి సీతక్క సత్కారం

వరంగల్ ఉవాయిస్ ఎడిటర్,ఐజెయు అనుబంధ టియుడబ్ల్యుజె హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గడ్డం కేశవమూర్తిని రాష్ట్ర పంచాయతీరాజ్ ,గ్రామీణ అభివృద్ధి శాఖల మంత్రి దనసరిఅనసూర్య(సీతక్క) శాలువాతో సత్కరించారు. ఇటీవల జరిగిన జర్నలిస్ట్ సంఘం ఎన్నికల్లో కేశవమూర్తి అధ్యక్షుడిగా ఎన్నిక కావడం పట్ల ఆమె సంతోషం వ్యక్తం చేశారు. టియుడబ్ల్యుజె పటిష్టతతో పాటు, జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆమె సూచించారు. ములుగు క్యాంప్ ఆఫీస్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో డిఎం అండ్ హెచ్ఒ డాక్టర్ అప్పయ్య పాల్గొని కేశవమూర్తికి శుభాకాంక్షలు తెలిపారు.

# బడిబాటలో 10శాతం లక్ష్యాన్ని మించి నమోదు పెంచాలి

## ఎఐ ఆధారిత విద్య, సమ్మిళిత విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలి: వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**ప్రజాపక్షం/ వరంగల్:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును గణనీయంగా పెంచేందుకు నిర్వహిస్తున్న ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం 202627 నిర్వహించడం జరుగుతుందని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. శనివారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ పాఠశాలల, డిగ్రీ కాలేజీలలో ఇంటర్మీడియట్ కాలేజీలలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు దశ నిర్దేశం చేసేందుకు విద్యాశాఖ అధికారులు, ఇంటర్మీడియట్, డిగ్రీ కాలేజీల ప్రిన్సిపాల్స్ లతో సమీక్ష సమావేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో బడిబాట కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేసి ప్రభుత్వం నిర్దేశించిన 10 శాతం లక్ష్యాన్ని మించి నమోదు పెంపు లక్ష్యాన్ని సాధించేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్లాలని అధికారులను ఆదేశించారు. ప్రతి పాఠశాల స్థాయిలో ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి, ఇంటింటి ప్రచారం, తల్లి దండ్రులతో సమావేశాలు, పాఠశాలల ప్రత్యేకతల ప్రచారం వంటి వినూత్న కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారంగా నిర్దేశించిన ప్రాథమిక పాఠశాలల్లో ప్రత్యేక దృష్టి సారించి నమోదు పెంపుకు చర్యలు చేపట్టాలన్నారు. విద్యార్థుల అభ్యాస నైపుణ్యాల పెంపు కోసం డిజిటల్ విద్యా వనరులను సమర్థవంతంగా వినియోగించి, ప్రతి విద్యార్థికి వాటి ప్రయోజనాలు అందేలా కృషి చేయాలని సూచించారు. భవిత కేంద్రాలను బలోపేతం చేసి, ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల (సిడబ్ల్యూఎస్ఎన్) నమోదును




పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు పెంపులో వినూత్న పద్ధతులు అవలంబించి, విశేష ఫలితాలు సాధించిన కొందరు విద్యాధికారులకు ప్రభుత్వం విదేశీ పర్యటన అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. సానిటరి సోక్ ఫిట్ ఏర్పాట్లు చేయాలని, నాలుగు రకాల బీన్స్ ఏర్పాటు చేసి పిల్లలకు రానున్న వర్ష కాలంలో ఫ్రైడే డ్రై డే ను నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) వైవి గణేష్, జిల్లా విద్యాశాఖ అధికారి రంగయ్య నాయుడు, ఏఎంఓ సుజన్ తేజ, కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి డాక్టర్ కె. శ్రీనివాస్, డిఐఈఓ శ్రీధర్ సుమన్, డిగ్రీ కళాశాలల నోడల్ అధికారి డాక్టర్ నవీన్, మండల విద్యాధికారులు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఆడపిల్లలకు ఆర్థిక భరోసా కల్యాణ లక్ష్మి : ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/మెదక్ :** పేద ఆడపిల్లల పెళ్లిళ్లకు ఆర్థిక భరోసా కల్పించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలు చేస్తున్నట్లు మెదక్ నియోజకవర్గ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. శానివారం చిన్న శంకరంపేట్ మండలంలో ప్రయివేట్ ఫంక్షన్ హాల్‌లో మండలంలోని లబ్ధిదారులకు మెదక్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు 115 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ చెక్కులను స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ఆడపిల్లల పెళ్లిళ్లకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కళ్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ పథకాలను ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకం అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. లబ్ధిదారులందరూ ఈ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజాప్రనతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు, లబ్దిదారులు పాల్గొన్నారు.

# గ్రామీణ సేంద్రియ ఉత్పత్తుల ప్రదర్శనకు విశేష స్పందన

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో జరుగుతున్న గ్రామీణ సేంద్రియ ఉత్పత్తులు, మిల్లెట్స్, ఆరోగ్యకర ఆహార పదార్థాల ప్రదర్శనకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తున్నట్లు మిల్లెట్స్ ప్రమోటర్, సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్, నిర్వాహకులు బయ్య సారయ్య తెలిపారు. ఈ ప్రదర్శన ఆదివారం రాత్రి 8 గంటల వరకు కొనసాగుతుందని వారు పేర్కొన్నారు.సేంద్రియ పద్ధతుల్లో తయారైన నాణ్యమైన ఉత్పత్తులు, మిల్లెట్స్ ఆధారిత ఆ హార పదార్థాలు వినియోగదారులకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. గ్రామీణ ఉత్పత్తులకు మార్కెట్ అవకాశాలు పెరగడంతో పాటు, ఆరోగ్యకర ఆహార అలవాట్లపై అవగాహన పెంపొందించడంలో ఇటువంటి ప్రదర్శనలు దోహదపడతాయని వారు పేర్కొన్నారు.పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతంచేయాలనివిజ్ఞప్తిచే శా రు.

# ఇన్‌స్ట్రక్టర్,ఆయా పోస్టులకు దరఖాస్తు

**ప్రజాపక్షం/వేలేరు :**సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో 2026–27 విద్యాసంవత్సరానికి వేలేరు మండలకేంద్రంలో నూతనంగా ప్రారంబించబడిన ప్రీప్రైమరీ పాఠశాలలో ఇన్‌స్ట్రక్టర్ ,ఆయా పోస్టుకు గౌరవ వేతన ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు వేలేరు మండలవిద్యాశాఖ అధికారి మొగిలిచెర్ల చంద్రమౌళి ఒక ప్రకటనలో తెలిపారు.ఈసంధర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ ఈనెల 8వతేదీవరకు దరఖాస్తులు సమర్పించుకోవాలని 10వతేదీన మండలవిద్యాశాఖ అధికారి దరఖాస్తులను పరిశీలించి జిల్లా విద్యాశాఖ అధికారికి సమర్పించబడునని అర్హులైన అభ్యర్థులు నిర్దేశిత దరఖాస్తు నమూనాను పూర్తిచేసి అవసరమైన ధృవపత్రాలతోపాటు సంబందిత పాఠశాల ప్రధానోపాధ్యాయునికి దరఖాస్తు చేసుకోవాలని ఎంపిక ప్రక్రియలో సంబందిత పాఠశాల ఉన్నగ్రామం స్థానికతఅభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వబడును.అర్హులైన అభ్యర్థులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నిర్ణీత గడువులోగా దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

# మహబూబాబాద్ ఎంపి పోరిక బలరాం నాయక్ జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/గూడూరు;**మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్ జన్మదినాన్ని పురస్కరించుకుని గూడూరు మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా వేడుకలు నిర్వహించారు.గూడూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కత్తి స్వామి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకలు కర్యకర్తలు కలిసి ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా గూడూరులోని సనాతన శివలయంలో ప్రత్యేక పూజలు అర్చనలు నిర్వహించి ఎంపి బలరాం నాయక్ ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ప్రార్థంచారు. అనంతరం నాయకలు కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. గూడూరు మండంలంలో సీఎంఆర్ చెక్కులను మండలంలో ఎక్కువమందికి వచ్చే విధంగా పని చేస్తున్నారని అన్నారు. మాధవపెద్ది అమరేందర్‌రెడ్డి జిల్లా మహిళ కాంగ్రెస్ నాయకురాలు వెంకన్న నాయకలు కర్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సైబర్ మోసగాళ్లతో ప్రజలు అప్రమతంగా ఉండాలి

## ఎస్‌పి పరితోష్ పంకజ్



**ప్రజాపక్షం/ కొండాపూర్ :** తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్య చరణలో భాగంగా కొండాపూర్ మండలం గొల్లపల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో జిల్లా ఎస్‌పి పరితోష్ ఫంకజ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎస్‌పి ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ జిల్లాలో మహిళల భద్రతకు పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. మహిళలపై జరుగుతున్న వివిద రకాల నేరాలు పోక్సో అత్యాచార కేసుల్లో భరోసా కేంద్రం పనితీరు మహిళల రక్షణ కోసం షీటీమ్స్ అందిస్తున్న సేవలు సైబర్ నేరాల నివారణ చర్యలు అత్యవసర సేవల వినియోగం తదితర అంశాలపై ప్రజలకు వివరించారు. సబ్ డివిజన్‌ల వారీగా ఏర్పాటు చేసిన షీటీమ్ బృందాలు పాఠశాలు ,కళాశాలలు, బస్ స్టాండ్లు ప్రజలు రద్దీగా ఉండే ప్రాంతాల్లో గస్తే నిర్వహిస్తూ ఆకతాయాలకు చెక్ పెడుతున్నాయి. అదే విధంగా మహిళలపై జరుగుతున్న నేరాలు పోక్సో చట్టం అత్యాచార నిరోదక చట్టాలపై అవగాహన నిర్వహించారు. వివిధ పోలీసు స్టేషను స్టేషన్లలో నమోదైన పోక్సో అత్యాచార కేసుల్లో బాదిత మహిళలకు అవసరమైన అన్ని రకాల మెడికో లీగల్ సేవలను ఒకే గొడుగు కింద అందిస్తు భారత మహిళల్లో పని ప్రదేశాల్లో ,ఇతర ప్రాంతాల్లో ఏలాంటి సమస్యలను ఎదుర్కొన్నా వెంటనే జిల్లా షీటీం నెంబర్ 8712656772 ,ఉమెన్ హెల్ప్ లైన్ నెంబర్ 181/డయల్ 100కు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. ఆ కార్యక్రమంలో సంగారెడ్డి డిఎస్‌పి, సత్యయ్య గౌడ్, డిప్యూగా సిఇఒస్వప్న తహసీల్దార్ అశోక్, ఎస్‌ఐ సోమశ్వరి, ఎంపిడిఒ సౌమ్య శ్రీ, గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ ,వివిధశాఖల అధికారులు ప్రజాప్రతినిధులు,వార్డుసభ్యులుగ్రామస్థులు మహిళలు పాల్గొన్నారు.

# కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లులు చెల్లించాలి

## బిఎఐ నేషనల్ వైస్ ప్రెసిడెంట్ వేముల సత్యమూర్తి

**ప్రజాపక్షం/హనుమకొండ :** కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించి ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న కాంట్రాక్టర్లను నిలబెట్టాలని బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నేషనల్ వైస్ ప్రెసిడెంట్ వేముల సత్యమూర్తి ప్రభుత్వాన్ని కోరారు. శనివారం హనుమకొండ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సత్యమూర్తి మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న కాంట్రాక్టర్ల బిల్లులను ఎటువంటి ప్రభావాలు, సిఫారసులు, వివక్ష లేకుండా క్రమ పద్ధతిలో చెల్లింపు చేయాలని సంవత్సరాలుగా బిల్లుల కోసం ఎదురుచూస్తున్న కాంట్రాక్టర్లకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. బిల్లులు చెల్లించకపోవడం వల్ల కాంట్రాక్టర్లు ఆర్థిక ఇబ్బందులతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురి అవుతూ కొంత మంది ఆత్మహత్య ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.కాంట్రాక్టర్లకు బిల్లు ఆలస్యం అవ్వడం వల్ల కాంట్రాక్టర్లకే కాకుండా కాంట్రాక్టర్లపై ఆధారపడ్డ వేలాదిమంది ఉద్యోగులు, ఇంజనీర్లు, సూపర్వైజర్లు, అకౌంటెంట్లు, యంత్రాల ఆపరేటర్లు, డ్రైవర్లు, కార్మికులు నిర్మాణ సామాగ్రిస్ సరఫరాదారులు అనేకమంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కాంట్రాక్టర్ల హక్కులను కాపాడేందుకు, వారి డిమాండ్ల పరిష్కారం కోసం బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 18న హైదరాబాద్లో నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ చైర్మన్ లు బి. సుగుణాకర్ రావు, కటుకూరి దేవేందర్ రెడ్డి, యు సురేందర్, అడ్వైజర్ ప్రభాకర్ రెడ్డి, జనగాం సెంటర్ ఫాస్ట్ చైర్మన్ ఇమ్మడి దేవేందర్ రెడ్డి, వరంగల్ సెంటర్ చైర్మన్ ఈ. మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఫార్మసీ అధికారులు రికార్డులను పక్కాగా నిర్వహించాలి

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** ఫార్మసీ ఆఫీసర్లు సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి వచ్చిన మందుల, పిహెచ్‌సిల నుండి ఆరోగ్య ఉప కేంద్రాలకు, సిబ్బందికి పంపిణీ చేసిన మందుల బ్యాచ్ నెంబర్,గడువు తేదీ ఇతర అన్ని వివరాలను సంబంధించిన రికార్డులలో పక్కాగా నిర్వహి ంచాలని హనుమకొండ డిఎంహెచ్ఓ డాక్టర్ ఏ అప్పయ్య సూచించారు. శనివారం కలెక్టరేట్ లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆ యన మాట్లాడుతూ ముందుగా వచ్చిన మందులను ముందుగా ఉపయోగించాలని, అలాగే ఏదైనా పిహెచ్ సీ లో తక్కువగా వినియోగం లో ఉన్న మందులను దగ్గరలోని అవసరమైన పీహెచ్ సీ లకు పంపించాలని ఆయన సూచించారు. యాంటి రాబిస్ వ్యాక్సిన్, యాంటీ స్నే క్ వోనం, స్టాక్ వివరాలు పిహెచ్ సీలలోని వివరాలు తెలుసుకున్నా రు. వ్యాక్సిన్ కోల్డ్ చైన్ సిస్టం దెబ్బతినకుండా వ్యాక్సిన్ లను తగిన ఉష్ణోగ్రతలో భద్రపరచాలన్నా రు. ఈ ఔషధీ పోర్టల్‌లో అన్ని వివరాలను నమోదు చేయాలన్నారు

# 'సర్' ప్రక్రియను బిఎల్‌ఒలు వేగవంతంగా పూర్తి

**ప్రజాపక్షం/హనుమకొండ:** వరంగల్ తూర్పు నియోజకవర్గంలో ప్ర త్యేక సమగ్ర సవరణ (ఎస్‌ఐఆర్) ప్రక్రియ ను బిఎల్‌ఒలు మరింత వేగవంతంగా పూర్తిచేయాలని హనుమకొండ జి ల్లా కలెక్టర్ గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఇన్చార్జి కమిషనర్, చాహత్ బాజ్ పాయి అన్నారు. శనివారం హ నుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో నూతన బిఎల్‌ఒలతో వరంగల్ తూర్పు నియోజకవర్గంలో సర్ ప్రక్రియపై ఇన్‌చార్జి కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా కలెక్టర్, ఇ న్‌చార్జి కమిషనర్ చాహత్ బాజ్ పాయి ఎన్నికల ప్రక్రియ లో బూత్ లెవల్ అధికారుల పాత్ర అత్యంత కీలకమని పే ర్కొంటూ, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్‌ఐఆర్) కార్యక్రమాన్ని నిబంధనలకు అనుగుణంగా, పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ కార్యక్రమానికి సంబంధించిన మార్గదర్శకాలు, ఇంటింటి ధృవీకరణ ప్ర క్రి య, అర్హులైన ప్రతి ఓటరును జాబితాలో నమోదు చేయడం, మరణించిన లేదా శాశ్వతంగా వేరే ప్రాంతాలకు వెళ్లిన వారి వివరాలను పరిశీలించడం వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో నాయబ్ తహసిల్దార్ ఎండి సుభాన్, బి ఎల్ వో లు పాల్గొన్నారు.

**సర్వే పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి**

జిల్లాలో కొనసాగుతున్న సర్వే పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అధికారులను ఆదేశించా రు .శనివారం జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో భూ రికార్డులు, భూ కొలతల శాఖ అధికారులు, సర్వే యర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ వివిధ సర్వే పనుల పురోగతిని సమీక్షించారు.ప్రత్యేకంగా చెరువు శిఖం భూముల సర్వేను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. జానకీపురం, ముచ్చర్ల గ్రామాల్లో కొనసాగుతున్న రీసర్వే ప్రక్రియను వేగవంతం చేసి పెండింగ్ అంశాలను పరిష్కరించాలని ఆదేశించారు.భూ సంబంధిత సమస్యల పరిష్కారంలో సర్వే కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్న కలెక్టర్, ఖచ్చితత్వంతో కూడిన సర్వే నిర్వహణ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించవచ్చన్నారు. ప్రతి కేసును బాధ్యతాయుతంగా పరిశీలిస్తూ నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలని సూచించారు.ఈ సమావేశంలో భూ రికార్డులు, భూ కొలతల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నూర్ సింగ్, డిప్యూటీ ఇన్స్పెక్టర్లు సారంగపాణి, రాజనర్సయ్యతో పాటు జిల్లాలోని 14 మండలాల సర్వేయర్లు పాల్గొన్నారు.

# దాతల ఫోన్‌పేతో ఆర్థిక సాయం అందజేత

**ప్రజాపక్షం/భూపాలపల్లి(కొత్తపల్లిగోరి) :** జయశంకర్ జిల్లా కొత్తపల్లిగోరి మండల కేంద్రానికి చెందిన కట్ల సతీష్ ముదిరాజ్ (33 సం.) చేపలు పట్టడమే వృత్తిగా చేసుకొని వచ్చిన డబ్బులతో కుటుంబాన్నిపోషించుకుంటున్నాడు.సతీష్ ఎప్పటిలాగే బోక్కు చెరువులోకి చేపలు పట్టడానికి వెళ్లి,ప్రమాదవశాత్తు లోతైన బొందలో వలలు వేస్తుండగా వల కాళ్లకు చుట్టుకుని మరణించారు.ఇతనికి భార్య మౌలిక ఇద్దరు పిల్లలు హన్సిక (9 సం.),జ్ఞాన్సిక (4 సం.)తల్లి ఉన్నారు.సతీష్ వాళ్ళ నాన్న తన చిన్న తనంలోనే మరణించారు.సతీష్ వాళ్ళ ఇంటి పెద్దగా చిన్నప్పటి నుంచి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటూ ఉంటున్న క్రమంలో ఈ విషాదం చోటుచేసుకుంది.ఆర్థికంగా ఏమి లేని నిరుపేద.ఇద్దరు అమ్మాయిలను చదివిస్తూ,కుటుంబాన్ని పోషించుకుంటున్న క్రమంలో ఇలాంటి దురదృష్టకరమైన సంఘటన బాధాకరం. పసిపాపలు ఏడుస్తూ ఉంటే చూసే వారి హృదయం కరిగి కన్నీరు పెట్టినవారే.ఆ చిన్నారుల చిన్న వయసులోనే తండ్రి లేని లోటు ఎవరూ పూడ్చలేనిది.కనీసం జీవిత బీమా పాలసీ కూడా చేసుకోలేని పరిస్థితి.కుటుంబ పోషణ ఎలాగో తెలియని అయోమయ పరిస్థితిలో ఆ కుటుంబం కనిపిస్తోంది.మానవతా హృదయంతో ఈ చిన్నారులకు సహాయం వారి భవిష్యత్తుకు ఉపయోగపడగలరని ఆశిస్తున్నామని, మీరు మీ ఆర్థిక సహాయాన్ని అందించాల్సిన ఫోన్ పే నం.8008791400.రేగుల సహదేవ్ కి పంపగలరని మెపా రాష్ట్ర కమిటీ తెలిపారు.ఈ కథనంపై ప్రజాపక్షం పత్రికలో సాయం అందిద్దాం.. కుటుంబానికి అండగా ఉందాం వార్తను ప్రచురించిన విషయం పాఠకులకు విధితమే..ఈ కథనంపై దాతలు స్పందిస్తూ వారికి తోచిన ఆర్థిక సాయం ఫోన్ పేతో పంపడం పట్ల దాతలకు,ప్రజాపక్షం పత్రికకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఆదర్శ పాఠశాలల బాలికల హాస్టల్‌లో నాన్ టీచింగ్ పోస్టులకు దరఖాస్తులు

**ప్రజాపక్ష/జనగామ :**జనగామ జిల్లాలోని ఆదర్శ పాఠశాలల బాలికల హాస్టళ్లలో ఖాళీగా ఉన్న నాన్ టీచింగ్ పోస్టులకు అవుట్ సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేయనున్నందున ఆసక్తిగల వారు ధరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్, విద్యాశాఖ అధికారి సందీప్‌కుమార్ ఝా తెలిపారు. శనివారం ఆయనొక ప్రకటన చేస్తూ కొడకండ్లలో ఒక ఎఎన్‌ఎం పోస్టు, జఫర్గడ్‌లో ఒక ఎఎన్‌ఎం, అసిస్టెంట్ కుక్, వాచ్‌మెన్, స్టేషన్‌ఘనపూర్‌లో కేర్ , వార్డెన్, ఎఎన్‌ఎం, బచ్చన్నపేటలో హెడ్‌కుక్, అసిస్టెంట్ కుక్ మొత్తం 8 పోస్టులకు ఖాళీగా ఉన్నాయన్నారు. అభ్యర్థుల వయస్సు నోటిఫికేషన్ తేదీ నాటికి 40 సంవత్సరాలు ఉండాలని, ఎస్సీ, ఎస్టీ బిసిలకు 5 సంవత్సరాలు, దివ్యాంగులకు 10 సంవత్సరాల సడలింపు ఉంటుందన్నారు. కేర్ వార్డెన్ డిగ్రీతో పాటు డిఎడ్, బిఈడి ఉండాలని, వీరి గౌరవ వేతనం 12500రూపాయలు ఉంటుందన్నారు. ఎఎన్‌ఎం 3 పోస్టులు ఉండగా ఇంటర్మీడియట్, ఎన్‌ఎం శిక్షణ పూర్తి చేస ఉండాలని గౌరవ వేతనం 7800 రూపాయలు, హెడ్‌కుక్ ఒక పోస్టు కాగా 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, గౌర వేతనం 7800 రూపాయలు ఉంటుందన్నారు. అసిస్టెంట్ కుక్ 2మ పోస్టులు కాగా కనీసం 7వ తరగతి ఉత్తీర్ణత కలిగి ఉండాలని, గౌరవ వేతనం 6500 రూపాయలు ఉంటుందన్నారు. వాచ్‌మెన్ 10వ తరగతి ఉత్తీర్ణత కలిగి ఉండాలని వీరి గౌరవ వేతనం 8710 రూపాయలు ఉంటుందన్నారు. ఆసక్తిగల వారు ఈ నెల 10వయ తేదీని నాటికియ జిల్లావిద్యాశాఖకార్యాలయంలోధరఖాస్తు చేసుకోవాలని సూచించా రు.

# బాధిత కుటుంబానికి పరామర్శ

**ప్రజాపక్షం/తొర్రూరు :** మండలంలోని మడిపెల్లి గ్రామానికి చెందిన రెండవ వార్డు సభ్యులు మహంకాళి సంపత్ అత్త వేల్పుల సోమక్క అనారోగ్య సమస్యతో మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను తొర్రూరు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ఎంపీటీసీ జక్క మహబూబ్‌రెడ్డి పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరాజేందర్‌రెడ్డిల ఆదేశాల మేరకు బాధిత కుటుంబాన్ని పరిమర్శించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అనారోగ్యంతో మృతి చెందిన వేల్పుల సోమక్క అంతిమ యాత్రలో పాల్గొని పాడె మోశారు. సోమక్క పార్థివదేహానికి మహబూబ్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డిలు పూలమాలల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి బియ్యం, ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మృతురాలి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మడిపెల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెన్నెం సోమిరెడ్డి, మాజీ సర్పంచ్ గడీల మాధవి సాయిలు, గ్రామ పార్టీ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, రాంరెడ్డి, వెంకట్‌రెడ్డి, తూర్పాటి రాంబాబు, వేల్పుల వెంకన్న, చంటి, మీనారెడ్డి, సురేశ్, యర్రం రాజు, హరీశ్, భార్గవ్, మంజుల, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌ఎంఎంఎస్ పథకానికి మాధాపురం ఉన్నత పాఠశాల విద్యార్థి ఎంపిక

**ప్రజాపక్షం/దేవరుప్పుల:** మండలంలోని మాదాపురం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి ధరావత్ రిత్విక్ ఎన్‌ఎంఎంఎస్ పథకానికి ఎంపికవడం జరిగిందని పాఠశాల హెచ్‌ఎం వీరగోని రమేష్ ఒక ప్రకటనలో తెలియజేశారు. జిల్లాలో మొత్తం 36 మంది విద్యార్థులు ఈ పథకానికి ఎంపిక కాగా మాధాపురం పాఠశాల నుండి రిత్విక్ ఎంపిక కావడం పట్ల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ పథకంలో భాగంగా ఎంపికైన విద్యార్థులకు 4 సంవత్సరాల పాటు సంవత్సరానికి రూ.12వేల చొప్పున వారి ఖాతాకు నేరుగా అందజేయడం జరుగుతుంది.

## నూతన కాంగ్రెస్ గ్రామ కమిటీని ఎన్నుకున్న కాంగ్రెస్ శ్రేణులు

**ప్రజాపక్షం/దేవరుప్పుల:** టిపిసిసి జిల్లా ఉపాధ్యక్షురాలు ఝాన్సిరెడ్డి, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నల్ల శ్రీరామ్ ఆద్వర్యంలో మండలంలోని ధర్మాపురం, లక్ష్మ ణ్ తండా కాంగ్రెస్ నూతన కమిటీలను కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ధర్మపురం గ్రామ అధ్యక్షుడిగా బిండి యాకయ్య, లక్ష్మ ణ్ తండా గ్రామ కాంగ్రెస్ అద్యక్షునిగా భూక్య వీరేష్‌ను నాయకులు, కార్యకర్తలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ గ్రామాలలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడంతోపాటు పార్టీ సిద్దాంతాలు, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో కీలక పాత్ర పోషిస్తామన్నారు. జిల్లా నాయకులు ధ ర్మారెడ్డి, పాండు, రసూల్, సజ్జన్, గణేష్, రవి, యాకన్న, అనిల్ కుమార్, రామచంద్రు, రాజేందర్, రవి, సర్పంచ్ సుధాకర్, నరసయ్య, ఉప స ర్పంచ్ రేణుక, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## రసాభాసగా గ్రామసభ

**ప్రజాపక్షం/తరిగొప్పుల :** మండలంలో ప్రజా ప్రణాళికలో భాగంగా నిర్వహిచిన గ్రామసభ రసాభాసగా జరిగింది. మండల కేంద్రంలో పెద్ద చెరువులో జరిగిన కరువు పనిలో ఒక మహిళ మొబైల్ ఫోన్‌ను తీసుకెళ్లడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. ఇదే రోజు గ్రామ సభ నిర్వహించడంతో పెద్ద ఎత్తున మహిళలు గ్రామసభలో పాల్గొని తహసీల్దార్‌పై నిరసన వ్యక్తం చేశారు.అనతరం గ్రామ సర్పంచ్ అర్జుల జ్యోతి మాట్లాడుతూ గ్రామంలో జరుగుతున్న పనులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని, అన్ని మౌళిక వసతులు కల్పిస్తున్నామని గ్రామాన్ని అన్నివిదాల అభివృద్ధి పథంలో నడిపించేందుకు పని చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తహశిల్దార్ మోసిన్, జీపీవో కరుణాకర్, కార్యదర్శి రాము, మండల అధికారులు, వార్డు మెంబర్లు, పాల్గొన్నారు.

## ట్రాన్స్‌జెండర్ సమాజ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

### కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

**ప్రజాపక్షం/హనుమకొండ :** హనుమకొండ జిల్లాలో నివసిస్తున్న ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ సభ్యులకు గుర్తింపు, సంక్షేమ పథకాల అందుబాటు, సామాజిక భద్రత కల్పించే ఉద్దేశంతో నిర్వహించిన ట్రాన్స్‌జెండర్ ఐడెంటిటీ కార్డుల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అర్హులైన ట్రాన్స్‌జెండర్ సభ్యులకు గుర్తింపు కార్డులను అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి విశ్వజ, ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ రాష్ట్ర అధ్యక్షురాలు ఓరుగంటి లైలా, రాష్ట్ర సలహాదారుడు ఇ.వి. శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ, ట్రాన్స్‌జెండర్ సమాజానికి కూడా సమాజంలోని ఇతరుల మాదిరిగానే సమాన హక్కులు, అవకాశాలు లభించాల్సిన అవసరం ఉందన్నారు. ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీకి సంబంధించిన సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి జిల్లా పరిపాలన ఎల్లప్పుడూ సహకరిస్తుందని హామీ ఇచ్చారు. ట్రాన్స్‌జెండర్ గుర్తింపు కార్డులు వారికి అధికారిక గుర్తింపును కల్పించడంతో పాటు వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందేందుకు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు.రాష్ట్ర సలహాదారుడు ఇ.వి. శ్రీనివాస్ రావు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ట్రాన్స్‌జెండర్ సమాజ సంక్షేమం కోసం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ సభ్యులకు రాజకీయ, సామాజిక రంగాలలో ప్రాధాన్యత కల్పిస్తూ జిల్లా కాంగ్రెస్ పార్టీలో కార్యదర్శి పదవి ఇవ్వడం అభినందనీయమని అన్నారు. ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ రాష్ట్ర అధ్యక్షురాలు ఓ. లైలా మాట్లాడుతూ, ట్రాన్స్‌జెండర్‌ల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు కృతజ్ఞతలు తెలిపారు.ట్రాన్స్‌జెండర్‌ల సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం, ప్రజాప్రతినిధులు, సామాజిక సంస్థలు కలిసి పనిచేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ సభ్యులు రింషా, హనీ, జిల్లా సంక్షేమ శాఖ సిబ్బంది వెంకటరమణ, రవికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రైతులు అంతర్ పంటలు, పంట మార్పిడిపై దృష్టి పెట్టాలి

**ప్రజాపక్షం/ వరంగల్ :** రైతులు అంతర్ పంటలు, పంట మార్పిడిపై దృష్టి పెట్టాలని, అధిక రసాయన ఎరువులు వాడొద్దని, క్యాన్సర్ ముప్పును కొని తెచ్చుకోవద్దు, ఆడపిల్లల విద్యను ప్రోత్సహించి సమాజాభివృద్ధికి తోడ్పడాలి వరంగల్ జిల్లా డాక్టర్ సత్య శారద అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా శనివారం గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని, వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో రైతులు సంప్రదాయ పంటలతో పాటు ప్రత్యామ్నాయ పంటల సాగుపైనా దృష్టి సారించాలని సూచించారు. అవసరమైన పరిస్థితుల్లో వ్యవసాయ శాఖ అధికారులు సూచించిన వరి వంగడాలను సాగు చేయాలని తెలిపారు. రైతులు కందులు, బంతిపూలు, కూరగాయలు వంటి అంతర్ పంటలను ప్రోత్సహించాలని, పంట మార్పిడి విధానాన్ని అనుసరించాలని సూచించారు. దీంతో రైతులకు అదనపు ఆదాయం లభించడమే కాకుండా, బంతి పూల వంటి పంటల ద్వారా క్రిమికీటకాల ప్రభావాన్ని కూడా తగ్గించుకోవచ్చని చెప్పారు. అధిక రసాయనాలు కలిగిన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించాలని, వాటి వల్ల ఆరోగ్య సమస్యలు, క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులు వచ్చే అవకాశం ఉందని హెచ్చరించారు. పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్న కలెక్టర్, తడి చెత్త, పొడి చెత్త, బయో వేస్ట్, సానిటరీ వేస్ట్‌ను వేర్వేరుగా సేకరించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని సూచించారు. మహిళా సాధికారత, విద్యాభివృద్ధి ద్వారానే సమాజం పురోగమిస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈఓ రామ్ రెడ్డి, దుగ్గొండి తహసిల్దార్ సమ్మక్క, గ్రామ ప్రజలు సంబంధిత శాఖల మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమానికి రాజకీయ పార్టీలు సహకరించాలి

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపడుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా, నిష్పాక్షికంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్, జిడబ్ల్యూఎంసి ఇన్‌చార్జి కమిషనర్ చాహత్ బాజ్‌పాయి కోరారు. శనివారం జిడబ్ల్యూఎంసి ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఇన్‌చార్జి కమిషనర్ మాట్లాడుతూ ఓటరు జాబితాలను మరింత ఖచ్చితత్వంతో రూపొందించేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడంతో పాటు మరణించిన, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు మారిన, ద్వంద్వ నమోదు కలిగిన, అనర్హులైన పేర్లను జాబితాల నుండి తొలగించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. జూన్ 25 నుండి జులై 24 వరకు నిర్వహించే ఇంటింటి ధృవీకరణ ప్రక్రియలో ప్రతి రాజకీయ పార్టీ ప్రతి పోలింగ్ కేంద్రానికి బూత్ లెవల్ ఏజెంట్లను నియమించి చురుకుగా పాల్గొనాలని సూచించారు. క్షేత్రస్థాయిలో జరిగే పరిశీలనలో అర్హులైన ఓటర్ల నమోదు, ద్వంద్వ నమోదుల గుర్తింపు, చిరునామా మార్పులు, మరణించిన ఓటర్ల వివరాల నిర్ధారణలో సహకరించాలని కోరారు. ఎన్నికల చట్టం ప్రకారం ఒక వ్యక్తికి ఒకే నియోజకవర్గంలో, ఒకే ఓటరు నమోదు మాత్రమే ఉండాలని స్పష్టం చేశారు. ఓటరు జాబితాలో అర్హులైన వారి పేర్లు మిస్ కాకుండా, అనర్హుల పేర్లు కొనసాగకుండా రాజకీయ పార్టీలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఓటర్లు తమ వద్ద ఉన్న గుర్తింపు పత్రాలలో ఏదైనా ఒకదానికి సంబంధించిన ధృవీకరణ పత్రాన్ని స్వయ ధృవీకరణతో సమర్పించాల్సి ఉంటు ందని వివరించారు. తహసీల్దార్లు శ్రీకాంత్, డిటి సుభాన్, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎఫ్‌సిఐ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

### ఆహార భద్రతకు ముప్పు వాటిల్లే ప్రమాదం:నక్క సైదులు

**ప్రజాపక్షం/గూడూరు;** భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) నిర్వహణలో ఉన్న ఆహార ధాన్యాల నిల్వ వ్యవస్థను ప్రైవేట్ సంస్థలకు అప్పగించే కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కొత్తగూడ గంగారం గూడూరు ఏరియా కమిటి కార్యదర్శి నక్క సైదులు డిమాండ్ చేశారు.శనివారం గూడూరు మండల కేంద్రంలోని తహశీల్థార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారికి వినతి పత్రం సమర్పించారు.అనంతరం నక్క సైదులు మాట్లాడుతూ దేశ ఆహార భద్రకు వెన్నెముకగా ఉన్న ఎఫ్‌సీఐ గోదాములు నిల్వ కేంద్రాలను కార్పొరేట్ సంస్థల చేతుల్లోకి అప్పగించడం ప్రజల ప్రయోజనరాలకు విరుద్దమని అన్నారు. ఎఫ్‌సీఐ ప్రైవేటీకరణ వల్ల రైతుల నుంచి ప్రభుత్వ కొనుగోళ్లు క్రమంగా తగ్గిపోయే ప్రమాదం ఉందని తద్వారా కనీస మద్దతు ధర వ్యవస్థ బలహీన పడే అవకాశముందని పేర్కొన్నారు.రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసి ప్రజాపంపిణి వ్యవస్థను విస్యరించే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో కరువు ప్రకృతి విపత్తుల లేదా అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు ప్రజలకు ఆహార భద్రత కల్పించే బాధ్యత ప్రభుత్వానిదేనని అందుకు బలమైన ప్రజాపంపిణి వ్యవస్థను అవసరమని అన్నారు.ప్రజా పంపిణి వ్యవస్థను మరింత బలోపేతం చేసి పేదలకు నిత్యావసర వస్తువులను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే విద్య వైద్యం వంటి కీలక రంగాలు కార్పోరేట్ అధిపత్యంలోకి వెళ్లడంతో సామాన్య ప్రజలకు భారంగా మారాయని ఆహార భద్రత రంగాన్ని కూడా అదే ధాశగా నపడం సమంజసం కాదని పేర్కోన్నారు. ఈకార్యక్రమంలో ఈరెల్లి మల్లేశం అడ్డూరి బ్రహ్మచారి మన్యం మల్లేష్ వెంకన్న లక్ష్మ ణ్ సుందర్ వెంటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సమస్యలపై సర్పంచ్‌కు తీర్మానం అందజేత..



**ప్రజాపక్షం /నడికూడ:** హనుమకొండ జిల్లా నడికూడ మండలం నర్సక్కపల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించారు.రైతుల సంక్షేమం,పంటలకు గిట్టుబాటు ధర, మౌలిక సదుపాయాలు,సాగునీటి సమస్యలు, ఎరువులు, విత్తనాల లభ్యత వంటి అంశాలపై గ్రామ రైతులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.గ్రామసభలో రైతుల తరఫున పలు డిమాండ్లతో కూడిన తీర్మానాన్ని ఆమోదింపజేసి,ఆ తీర్మాన ప్రతిని తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు వరికెల కిషన్ రావు గ్రామ సర్పంచ్ కి అందజేశారు.వరికెల కిషన్ రావు మాట్లాడుతూ,రైతుల సమస్యలను ప్రభుత్వం,సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి,వాటి పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తామని గ్రామసభలో ఆమోదించిన తీర్మానాలను సంబంధిత శాఖలకు పంపించి రైతులకు న్యాయం జరిగేలా చర్యలు చూడాలని కోరారు.గ్రామ రైతుల ప్రయోజనాల కోసం గ్రామసభలో తీసుకున్న ఈ నిర్ణయం రైతుల్లో నూతన ఆశలు నింపిందని,రైతుల సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు,అధికారులు చొరవ చూపాలని గ్రామ రైతులు విజ్ఞప్తి చేశారు.

## అభివృద్ధిని అడ్డుకోవడం సరికాదు

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** అభివృద్ధిని అడ్డుకోవడం సరైన పద్ధతి కాదు అని హనుమకొండ గోపాల్ పూర్ ఊర చెరువు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం హనుమకొండలో వారు విలేఖరులతో మాట్లాడుతూ వర్షం పడి వరదలు వచ్చి కోట్లాది రూపాయలు ఆస్తి నష్టం జరిగితే అనేకసార్లు ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు ఇచ్చిన పట్టించుకోలేదని తమ బాధలు చూసి వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు చొరవ తీసుకొని ఊర చెరువు పూడికతీతతో పాటు రిటర్నింగ్ వాల్ నిర్మించేందుకు కృషి చేస్తుంటే మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ సమాధుల పేరుతో ఆ అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ జీవితాలతో రాజకీయాలు చేయడం తగదని, గోపాల్ ఊర చెరువు అభివృద్ధిపై వారికి చిత్తశుద్ధి ఉంటే రిటర్నింగ్ వాల్ నిర్మాణానికి సహకరించి తమ చిత్తశుద్ధిని చాటుపోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వివేక్ నగర్ కాలనీ అధ్యక్షుడు మర్రి ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి మీసాల రమేష్, సామాజిక కార్యకర్త తుపాకుల దశరథం, కోశాధికారి వినోద రావు, అమరావతి నగర్ అధ్యక్షుడు భీమ గాని యాదగిరి గౌడ్, నాయకులు రవీందర్ రావు, బోప్ప శివ శంకర్, నల్లాని శ్రీనివాస్, బత్తుల సుదర్శన్ గౌడ్, డాక్టర్ సత్యనారాయణ, రమణా రెడ్డి, దేవేందర్ రెడ్డి, జితేందర్, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల భాగస్వామ్యంతోనే పారిశుద్ధ్య పరిరక్షణ సాధ్యం

**ప్రజాపక్షం/కమలాపూర్:** గ్రామంలో ప్రజల భాగసామ్యం పెరిగినప్పుడే పారిశుద్ధ్య పరిరక్షణ సాధ్యమవుతుందని, ఎవరి పరిసరాలను వారే పరిశుభ్రంగా ఉంచుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కమలాపూర్ మేజర్ గ్రామపంచాయతి సర్పంచ్ పబ్బు సతీష్ పేర్కొన్నారు. స్వచ్ఛ కమలాపూర్ లక్ష్యంగా వరుసగా ఐదోవారం చేపట్టిన ఊరు కోసం ఒక్క రోజు శ్రమదానం కార్యక్రమంలో భాగంగా 4వ వార్డు వీధుల్లో సర్పంచ్, పంచాయతి పాలకవర్గం, సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్ల, మహిళలు, యువకులు కలిసి రహదారులను ఊడ్చి, మురికి కాలువలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పబ్బు సతీష్ మాట్లాడుతూ.... పారిశుద్ధ్య కార్మికుల శ్రమను గ్రామస్థులకు తెలియజేస్తూ ఊరిని పారిశుద్ధ్య పరిరక్షణ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రజలను భాగస్వాములను చేయడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. ఊరి బాగు కోసం అన్ని వర్గాల ప్రజలు శ్రమదానంలో కలిసిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఎండబెల్లి మల్లారెడ్డి, రాంశెట్టి రాజయ్య, మౌటం నాగరాజు, గంధసిరి అనిల్, పుల్ల శ్రీనివాస్, ఓస్కుల కీర్తన, ఆవునూరి తిరుపతి, పుల్ల అయిలయ్య, నాయకులు మార్క అశోక్, పిల్లి సతీష్, గంధసిరి బిక్షపతి, జన్ను బిక్షపతి, షేక్ ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి శిక్షణ తరగతుల ప్రారంభం



**ప్రజాపక్షం/నెక్కొండ :** వరంగల్ జిల్లా బొల్లికుంటలోని వాగ్దేశి ఇంజనీరింగ్ కళాశాలలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పండిట్ దీన్ దయాల్ ప్రశిక్షణ మహాభియాన్...2026 శిక్షణా తరగతుల ప్రారంభ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రధాన వక్తలుగా ఈటల రాజేందర్, రఘునందన్‌రావు హాజరై పార్టీ సిద్దాంతాలు, కార్యకర్తల బాధ్యతలు, ప్రజాసేవలో బిజెపి పాత్రపై మార్గనిర్ధేశం చేశారు.ఈ కార్యక్రమంలో నెక్కొండ మండలం నుండి వరంగల్ జిల్లా బిజెపి నాయకుడు అంబాల రామ్‌గోపాల్ పాల్గొన్నారు. అలాగే మండల భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై శిక్ష ణా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. పార్టీ బలోపేతం, కార్యకర్తల నైపుణ్యాభివృద్ధి లక్ష్యంగా ఈ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు నా యకులు తెలిపారు.

## గ్రామసభలో అర్థవంతమైన చర్చ జరగాలి

**ప్రజాపక్షం/రాయపర్తిఫ :** గ్రామంలోని సమస్యలపై గ్రామ సభలో అర్థవంతమైన చర్చ జరగాలని మండల ప్రత్యేకాధికారి శ్రీకాంత్ రెడ్డి, ఇన్‌చార్జి ఎంపిడిఓ కూచన ప్రకాష్ అన్నారు. మండలంలోని కాట్రపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో సర్పంచ్ రాపాక పద్మ అధ్యక్షతన జరిగిన గ్రామసభలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో గ్రామసభలు అత్యంత కీలకమైనవని పేర్కొన్నారు. గ్రామంలోని వివిధ సమస్యలపై ప్రజలందరూ గ్రామసభలో భాగస్వాములై అర్థవంతమైన చర్చ జరపాలని, తద్వారానే ప్రజాస్వామ్యయుతంగా సమస్యల పరిష్కారానికి మార్గం సుగుమం అవుతుందని అన్నారు. గ్రామంలోని ప్రజలకు నిరంతరం స్వచ్ఛమైన తాగునీరు అందించడం, పారిశుధ్య పరిరక్షణ వీధి దీపాల సక్రమ నిర్వహణ గ్రామ పంచాయతీ ప్రాథమిక ప్రధాన బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ పనుల్లో ఎలాంటి అలసత్వం వహించకుండా పంచాయతీ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గుండ్లపల్లి మధు, వార్డు సభ్యులు చిట్యాల వెంకన్న, కోలుకొండ ప్రశాంత్, ముప్పిడి మమత, కందుకూరి నరేందర్, మహ్మద్ యాస్మిన్, పంచాయతీ కార్యదర్శి రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ పండ్ల మార్కెట్ శంకుస్థాపనకు మార్కెట్ కమిటీప్రతినిధులు



**ప్రజాపక్షం/గూడూరు;**రంగారెడ్డి జిల్లా అబ్దుల్లానూర్‌మెట్ మండలం కోహెడ గ్రామంలో తెలంగాణస్త ప్రభుత్వం మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న అంతర్జాతీయ సమీకృత పండ్ల మార్కెట్ నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి హాజరుకావడానికి నెక్కోండ వ్యవసాయ మార్కెంట్ కమిటి ప్రతినిధులు శనివారం కోహెడకు బయలుదేరారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్‌రెడ్డి చేతుల మీదగా నిర్వహించనున్న ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో పాల్గోనేందుకు వెళ్లున్న ప్రతినిధుల వాహనాన్ని నెక్కోండ వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ రావుల హరీష్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు.ఈసందర్బంగా చైర్మన్ రావుల హరీష్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తుల మార్కెంట్‌ంగ్ వ్యవస్థను ఆధునికీకరించేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో భాగంగా అంతర్జాతీయ స్థాయి పండ్ల మార్కెట్ నిర్మాణం రైతులకు ఎంతో ప్రయోజనకరంగా మారుతుందని పేర్కోన్నారు. ఈ మార్కెట్ ద్వారా పండ్ల ఉత్పత్తిదారులకు మెరుగైన ధరలు నిల్వ సదుపాయాలు ఎగుమతి అవకాశాలు అభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈక్యాక్రమంలో నెక్కోండ మార్కెంట్ వైస్ చైర్మన్ ఎడ్ల నరేష్‌రెడ్డి కమిటి సభ్యులు దుడిమెట్ల కొమురయ్య జాముల సోమయ్య కొత్తపల్లి రత్నం బొమ్మరబోయిన రమేష్ కూన్నత్‌నైజాం మార్కెంట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాల విక్రేతలపై పీడీ యాక్ట్ నమోదు చేయాలి



**ప్రజాపక్షం/నర్సంపేట :** ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో నకిలీ విత్తనాలతో రైతులను మోసం చేసే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) నాయకులు డిమాండ్ చేశారు. శనివారం నర్సంపేట ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అనంతరం ఆర్డీవో ఉమారాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎలకంటి రాజేందర్, ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గట్టి కృష్ణలు మాట్లాడుతూ వివిధ కంపెనీల పేర్లతో గ్రామాలు, మండలాలు, డివిజన్ కేంద్రాల్లో రైతులకు విత్తనాలు అందజేస్తామంటూ నకిలీ విత్తనాలు విక్రయించే ప్రమాదం ఉందన్నారు. ముందస్తుగా విత్తనాల విక్రయ కేంద్రాలపై నిఘా ఏర్పాటు చేసి నకిలీ విత్తనాల అమ్మకాలను అరికట్టాలని కోరారు. విత్తనాల తయారీ రంగంలో బడా కార్పొరేట్ సంస్థలు ఆధిపత్యం చెలాయిస్తున్నాయని, స్థానిక వాతావరణ పరిస్థితులకు అనుకూలం కాని విత్తనాలను రైతులకు విక్రయిస్తూ లాభాలు పొందుతున్నాయని ఆరోపించారు. ఇటువంటి సంస్థలపై ప్రభుత్వం కఠిన నిఘా ఉంచి రైతులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే డీఏపీ ఎరువులు, క్రిమిసంహారక మందుల ధరలు భారీగా పెరిగాయని, పెరుగుతున్న ధరలను వెంటనే నియంత్రించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జక్కుల తిరుపతి, ప్రధాన కార్యదర్శి రాచర్ల బాలరాజు, ఉపాధ్యక్షుడు బొమ్మెడ సాంబయ్య, నాయకులు కుర్రి ఐలయ్య, భీమగాని మల్లయ్య, ఇట్టబోయిన రవి, బుర్రి వీరస్వామి, పనికిర రవి, సల్పాల రమేష్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయిలో ఉత్తమ గ్రామ పంచాయతీగా చల్వాయి

**ప్రజాపక్షం/ములుగు :** ప్రపంచ పర్యావరణ దినోత్సవం 2026 సందర్భంగా ఘన వ్యర్థాల నిర్వహణ విభాగంలో ఉత్తమ పనితీరు కనబరిచిన గ్రామ పంచాయతీల ఎంపికలో భాగంగా ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని చల్వాయి గ్రామ పంచాయతీ రాష్ట్రంలోనే ఉత్తమ మూడు గ్రామ పంచాయతీలలో ఒకటిగా ఎంపికై ప్రత్యేక గుర్తింపు పొందింది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర అటవీ, పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చల్వాయి గ్రామ సర్పంచ్ మేకల రాధ, పంచాయతీ కార్యదర్శి బి రాజశేఖర్లకు అవార్డును ప్రధానం చేశారు. శనివారం ములుగు జిల్లాలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క చల్వాయి గ్రామ పంచాయతీ సాధించిన ఈ ఘనతపై హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర స్థాయి అవార్డుకు చల్వాయి గ్రామ పంచాయతీని నామినేట్ చేసి విజయవంతంగా ఎంపిక చేయడంలో కృషి చేసిన జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు. అలాగే మండలాభివృద్ధి అధికారి, మండల పంచాయతీ అధికారి, పంచాయతీ కార్యదర్శి తదితరులను మంత్రి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇదే స్థాయిలో పనితీరు కనబరుస్తూ స్వచ్ఛత, పర్యావరణ పరిరక్షణ, గ్రామాభివృద్ధి కార్యక్రమాల్లో మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్‌రావు, జిల్లా పంచాయతీ అధికారి కె వెంకయ్య, గోవిందరావుపేట ఎంపిడిఓ వరుణ్ కుమార్, మండల పంచాయతీ అధికారి మమత, తదితరులు పాల్గొన్నారు.

## రెడ్డి సంఘం నూతన అధ్యక్షుడిగా మహేందర్ రెడ్డి

**ప్రజాపక్షం/రాయపర్తి :** మండలంలోని మైలారం గ్రామ రెడ్డి సంక్షేమ సంఘాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు సంధి మహేందర్ రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన ప్రతి సభ్యుడికి కృతజ్ఞతలు తెలిపారు. సంఘ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తూ, సభ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సంఘ ఐక్యతను బలోపేతం చేస్తూ విద్య, ఉపాధి, ఆరోగ్యం, సామాజిక సేవా కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. ఈ కార్య క్రమంలో ఉపాధ్యక్షులు పరుపాటి యాకూబ్ రెడ్డి, కార్యదర్శి వెలు మరెడ్డి మహేందర్ రెడిడ్డి, సహాయ కార్యదర్శి తాళ్ల సందీప్ రెడ్డి, కో శాధికారులు పరుపాటి రాజేందర్ రెడ్డి, సహకోశాధికారులు ఈరెడ్డి వెంకట్ రెడ్డి, గౌరవ సలహాదారులు లేతకుల సుధాకర్ రెడ్డి, లేత కుల యాదవరెడ్డి, ఐరెడ్డి వెంకటరెడ్డి, సమాచార ప్రతినిధి, లేతకుల మహేందర్ రెడ్డి, కమిటీ సభ్యులుగా పరుపాటి కిరణ్ కుమార్ రెడ్డి, ఐరెడ్డి ఎల్లారెడ్డి, లేతకుల మహేందర్ రెడ్డి, తాళ్ల మహబూబ్ రెడ్డి, పరుపాటి జనార్ధన్ రెడ్డిలు ఎన్నికయ్యారు.

## ఎండను లెక్కచేయని ఉపాధ్యాయుల బడిబాట

### నూతన విద్యార్థుల నమోదు కోసం విస్తృత ప్రచారం

**ప్రజాపక్షం/గోవిందరావుపేట :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచే లక్ష్యంతో నిర్వహిస్తున్న ప్రొఫెసర్ జయశంకర్ బడిడాట కార్యక్రమంలో భాగంగా శనివారం ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల బాలురు కర్లపల్లి ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయ బృందం విస్తృతంగా పర్యటించింది ఏటూరునాగారం కన్నాయిగూడెం వాజేడు వెంకటాపురం మండలాలతో పాటు రోహిర్ శంకర్‌రాజుపల్లి తదితర గ్రామాల్లో ఎండ తీవ్రతను సైతం లెక్కచేయకుండా ఇంటింటికీ వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులను కలుసుకున్నారు ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్న నాణ్యమైన విద్య వసతి భోజనం పుస్తకాలు యూనిఫాంలు తదితర సౌకర్యాల గురించి అవగాహన కల్పించారు ఈ సందర్భంగా పలు గ్రామాల్లో నూతన విద్యార్థులను నమోదు చేసుకుని మరింత మంది విద్యార్థులు ప్రభుత్వ విద్యాసంస్థల్లో చేరేలా తల్లిదండ్రులను ప్రోత్సహించారు విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని ఉపాధ్యా యులు సూచించారు ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఉపాధ్యాయ బృందం చేస్తున్న కషిని స్థానికులు అభినందించారు.

## 9వ వార్డు సమస్యలపై సభ



**ప్రజాపక్షం/ములుగు :** ములుగు మున్సిపాలిటీలోనినందు శనివారం సభ నిర్వహించగా 9వ వార్డు కౌన్సిలర్ గంద్రకోట వాణికుమార్ అధ్యక్షతన వహించగా మున్సిపల్ కమిషనర్ జనగం సంపత్ రెడ్డి, ఎలక్ట్రిసిటీ ఏఈ జ్ఞానేశ్వర్ మున్సిపాలిటీ హెల్త్ ఇన్స్‌స్పెక్టర్ నరేష్‌లు పాల్గొన్నారు. ఇందులో కేంద్ర ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణ కార్యక్రమం, రైతులకు వచ్చే ఖరీఫ్ సీజన్‌లో ఎరువులు విత్తనాలను సరైన సమయంలో అందించే ప్రక్రియ గురించి, మహిళా రక్షణ, రహదారి రోడ్డు భద్రతల గురించి, మాదకద్రవ్యాల నివారణ గురించి, ప్రకృతి విపత్తుల నుండి రెస్క్యూ టీం ఏర్పాటు గురించి, ముంపు ప్రాంతాలను గుర్తించి సకల పరిరక్షణ చర్యల గురించి వచ్చే వర్షాకాలంలో మురుగునీరు, పరిశుభ్రత, ఇళ్లలోకి నీరు వచ్చే ముంపు ప్రాంతాలను గుర్తించి పునరావాస కేంద్రాలకు నిరాశ్రయులను తరలించుట గురించి, ప్లాస్టిక్ వ్యర్థాలను చేపట్టడం గురించి వనహోత్సవంలో భాగంగా మొక్కలు నాటే లక్ష్యాలకు అనుగుణంగా వాటిని సిద్ధం చేయుట గురించి మున్సిపాలిటీలో దినచర్యగా పారిశుధ్య పనులు, వర్షాకాలంలో నీరు నిల్వ ఉండే ప్రదేశాలను గుర్తించి తగిన చర్యలు తీసుకొనుట గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పల్లవి, దూడవేన మహేందర్, కావటి భాస్కర్, రజనీకర్‌రెడ్డి, బాలు, సిద్దు, మహేష్, జయకర్, తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక క్వారీల్లో కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం

**ప్రజాపక్షం/మహాదేవపూర్ :** జయశంకర్ జిల్లా మహాదేవపూర్ మండలంలో ఏర్పాటైన ఇసుక క్వారీల్లో కాంట్రాక్టర్ల ఇష్టా రాజ్యం నడుస్తోందని నియంత్రించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు లింగంపెల్లి శ్రీనివాస్ రావు శనివారం ప్రకటనలో ఆరోపించారు.ఆన్లైన్‌లో బుకింగ్ చేసుకుని వచ్చిన లారీలకు ఎలాంటి అదనపు రుసుము వసూలు చేయకుండా లోడింగ చేయాల్సి ఉన్నా కాంట్రాక్టర్లు ఒక్కో లారీకి అక్రమంగా 2500 వసూలు చేస్తున్నారని తెలిపారు.క్వారీ నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా లోడింగ్ చార్జీల పేరిట చేస్తున్న అక్రమ వసూళ్ల విషయం అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టనట్లు వ్యవహరిస్తుండడంతో కా ంట్రాక్టర్ల ఆగడాలు రోజురోజుకు మితిమీరుతున్నాయని ఆవేదన వ్య క్తం చేసారు. తమకు సంబందించిన లారీలు వస్తే లో డి ంగ్ చేస్తున్నారని ఇ తరులను ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. క్వారీల్లో చేసిన లోడింగ్‌తో పోలిస్తే ఇతర ప్రాంతాల్లోని కాంటాల్లో తూకం చేస్తే టన్ను నుం డి రెండు టన్నుల వరకు తేడా చూపిస్తుందని దీంతో నష్టాల పాలౌతున్నామని తెలిపారు.టిజిఎండిసీ కాంటా లు,ప్రయివేటు కాంటాలు ఏర్పాటు సంబందిత అధికారుల పర్యవేక్షణ లేక నిర్వాహకులు తమ ఇష్టారీతిగా అక్రమాలకు పాల్పడుతున్నారని తెలిపారు.అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని సంబందిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు లేవని ఒక్కో లారీకి లోడింగ్ చేసే క్రమంలో వివిధ రకాల చార్జీల పేరిట మొత్తంగా 25 వందలు వసూలు చేస్తున్నారని దీంతో లారీ యజమానులు,డ్రైవర్లకు అధిక భారం డుతోందని ఆవేదన వ్యక్తం చేసా రు.ప్రస్తుత పరిస్థితుల్లో పెరిగిన డీజిల్,వివిధ రకాల ఖ ర్చులతో అనేక ఇబ్బందుల ఎదుర్కొంటున్నామని తెలిపారు.ఇప్పటికైనా సంబందిత అధికారులు సుక రీచు ల్లో జరుగుతున్న అవినీతి అక్రమాలను అరికట్టాల్సిన బా ధ్యత ఉందని అధికారులు స్ప ందించని యెడల బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.



## కానిస్టేబుల్ మృతిపై పోలీసుల సంతాపం..

**ప్రజాపక్షం/శివ్వంపేట :** మండల కేంద్రమైన శివ్వంపేట పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న మహిపాల్ మృతిపై స్థానిక పోలీసులు సంతాపం వ్యక్తం చేశారు. శుక్రవారం కానిస్టేబుల్ మహిపాల్ శివ్వంపేటలో తన విధులు ముగించుకొని స్వగ్రామమైన రామాయంపేట కోమటిపల్లికి బైక్‌పై వెళ్తుండగా రామాయంపేట శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే మృతిచెందారు. విధి నిర్వహణలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారని, మహిపాల్ మృతి బాధకరం అని పోలీసులు సంతాపం తెలిపారు.

## మహిళను వేధిస్తున్న యువకుడిపై కేసు నమోదు

**ప్రజాపక్షం/శివ్వంపేట :** శివ్వంపేట మండలం అల్లీపూర్ గ్రామంలో ఓ మహిళను యువకుడు వేధించిన ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన సాదు సురేష్ అదే గ్రామానికి చెందిన ఓ మహిళను గత మూడు నెలలుగా వేధిస్తున్నాడు. ఈ నెల 5న సాయంత్రం మహిళ బాత్రూంలో స్నానం చేస్తుండగా సాదు సురేష్ తన మొబైల్‌లో రికార్డింగ్ చేశాడని, ఈ విషయమై బాధిత మహిళ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి తెలిపారు.

## సుతార్‌పల్లి, జాన్సీలింగాపూర్‌లో గ్రామసభలు



**ప్రజాపక్షం/రామాయంపేట:** మండల పరిదిలోని సుతార్‌పల్లి, జాన్సీలింగాపూర్ గ్రామాల్లో శనివారం గ్రామసభలు నిర్వహించారు. గ్రామసభల్లో 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక నివేదికను సభలో చర్చించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. సుతార్‌పల్లిలో సర్పంచు మద్దూరి సునీల్, జాన్సీలింగాపూర్‌లో సర్పంచు మానేగల్ల రామకిష్టయ్య అద్యక్షతన గ్రామసభలు నిర్వహించారు. ఈకార్యక్రమాలకు తహాశీల్దార్ రజనికుమారి, ఎంపీవోలు హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల స్వచ్చతలో బాగంగా ఇళ్ల వద్దే తడి, పొడి చెత్తను వేరుచేసి పంచాయతి సిబ్బందికి అందించే ప్రక్రియపై అవగాహన కల్పించారు. రానున్న వర్షాకాలం దృష్యా సీజనల్ వ్యాదులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పారిశుద్య నిర్వహణపై ముఖ్యమైన సూచనలు చేశారు. ప్రభుత్వ సంక్షేమ పతకాల అమలు, స్థానిక సమస్యల పరిష్కారంపై సభలో చర్చించారు. గ్రామాల అభివృద్ధికి ప్రజలతో పాటు అధికారులు సహకరించాలని ఆయా గ్రామాల సర్పంచులు కోరారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సైకిల్‌ల పంపిణీ

### నాయిని ఉదయి రంజన్ గౌడ్




**ప్రజాపక్షం/మనోహరాబాద్:** మనోహరాబాద్ మండలంలోని కూచారం గ్రామ జిల్లా పరిషత్ హై స్కూల్లో చదువుతున్న బాలికలకు హైదరాబాద్ సైక్లిస్ట్ గ్రూప్ ఫౌండర్ రవీందర్,హెచ్‌సిజి గ్రూప్ సభ్యుల సహకారంతో పది సైకిళ్లను కూచారం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు నాయిని ఉదయ్ రంజన్ గౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా నాయిని ఉదయ్ రంజన్ గౌడ్ మాట్లాడుతూ, కూచారం జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థుల్లో ఉత్సాహం నింపడానికి, వారిలో కష్టపడే తత్వాన్ని పోటీ తత్వాన్ని అలాగే రోజు పాఠశాలకు వచ్చి మంచిగా చదువుకోవాలనే ప్రేరణ వారిలో కలిగించడానికి ఎప్పటికప్పుడు వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. హైదరాబాద్ సైకిల్స్ గ్రూప్ వారి సహకారంతో గతంలో విద్యార్థులకు బూట్లను పంపిణీ చేశామని గుర్తు చేశారు. విద్యార్థులు పాఠశాలకు సరిగా రావట్లేదని ఆ రోజు మా దృష్టికి రావడం జరిగిందని, వెంటనే హైదరాబాద్ సైక్లిస్ట్ గ్రూపు ఫౌండర్ రవీందర్ కి ఈ విషయాన్ని తెలియపరచగా విద్యార్థులు 90 పైన హాజరు నమోదు చేసి, మంచిగా చదువుతారో మొదటగా ఎంపిక చేసిన పదిమంది విద్యార్థులకు సైకిళ్లను ఇస్తామని ప్రకటించారని తెలిపారు. వారిచ్చిన మాట ప్రకారం శనివారం ప్రపంచ సైకిళ్ళ దినోత్సవం సందర్భంగా 10 సైకిళ్లను విద్యార్థినులకు అందజేశారు. దీనికి సహకరించిన హైదరాబాద్ సైక్లిస్ట్ గ్రూప్ ఫౌండర్ రవీందర్, గ్రూప్ సభ్యులకు, ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు, విద్యార్థినులకు నాయిని ఉదయ్ రంజన్ గౌడ్ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మర్రి లక్ష్మ ణ్ రెడ్డి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మ ణ్ రెడ్డి,హైదరాబాద్ సైక్లిస్ట్ గ్రూప్ సభ్యులు భీమ్ సింగ్,ఇతర సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మత్స్య శాఖ ఎడి మా గ్రామానికి న్యాయం చేయడం లేదు

### చేపలు పట్టడానికి కోర్టు ఆదేశాలు ఉన్నా, అనుమతులు ఇవ్వడం లేదు



**ప్రజాపక్షం/అల్లాదుర్గం:** అల్లాదుర్గం మండలంలోని గడి పెద్దాపూర్ మత్స్య కార్మిక సంఘం వారికి చేపలు పట్టడానికి అర్హత ఉన్న జిల్లా మత్స్యశాఖ ఏడి ఫిషరీస్ న్యాయం చేయడం లేదని మత్స్య కార్మికులు ఆరోపించారు. శుక్రవారం చేపలు పట్టడానికి చెరువుకు వెళ్లగా అనుమతులు ఇచ్చిన ఏడి ఫిషరీస్, మళ్లీ పెద్ద చెరువులో చేపలు పట్టవద్దని చెప్పడంతో గడి పెద్దాపూర్ మత్స్య కార్మికులు ఆందోళన వ్యక్తం చేశారు. చేపలు పట్టి జీవనోపాధి పొందుతున్న తమకు సొసైటీ ఉన్నప్పటికీ మత్స్యశాఖ జిల్లా అధికారులు తమకు సరైన న్యాయం చేయడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో గడి పెద్దాపూర్ గ్రామంలోని పెద్ద చెరువులో చేపలు పట్టాలని మత్స్యశాఖ ఏడి ఆదేశాలిచ్చి, మరలా వద్దని చెప్పడం ఏమిటని కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చెరువులో చేపలు నెల రోజుల క్రితమే పట్టాల్సి ఉండగా మత్స్యశాఖ అనుమతులు ఇవ్వకపోవడంతో హైకోర్టు ఆశ్రయించి అనుమతులు పొందిన, మత్స్యశాఖ ఏడి తమ పక్క గ్రామమైన కంసాన్పల్లి గ్రామస్తులకు వత్తాసు పలుకుతున్నారని, అన్ని అనుమతులు ఉన్న తమకు చేపలు పట్టవద్దని చెప్పడం ఎంతవరకు న్యాయమని వారు ప్రశ్నించారు. ఇప్పటికే పెద్ద చెరువులో చేపలు చనిపోవడం వల్ల మత్స్య కార్మికులమైన తమకు తీవ్ర నష్టం జరిగిందని ఇట్టి నష్టం ఎవరు భరిస్తారని వారు వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి చేపలు పట్టడానికి అనుమతులు ఇచ్చేలా మత్స్య శాఖ ఏడికి ఆదేశాలు ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు. రెండు గ్రామాల వేరువేరు జిల్లాలో ఉండడంతో అర్హులైన వారికి న్యాయం జరగడంలేదని వాపోయారు. రెండు గ్రామాల కార్మికులు చెరువు వద్దకు చేరుకోవడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అల్లాదుర్గం సీఐ రేణుక, ఎస్సై శంకర్ పర్యవేక్షించారు.

## నిబంధనలు ఉల్లంఘించిన డీలర్లకు షోకాజ్ నోటీసులు

### ఎంఆర్ పి ధరలకే ఎరువులను విక్రయించాలి

### మండల వ్యవసాయ అధికారి నాగం కృష్ణ



**ప్రజాపక్షం/పెద్ద శంకరంపేట్ :** వ్యవసాయ కాలం ప్రారంభమైన నేపథ్యంలో మండలంలోని ఎరువుల డీలర్లతో శనివారం మండల వ్యవసాయ అధికారి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రైతులకు ఎరువులను ఎంఆర్‌పి ధరలకే విక్రయించాలని మండల వ్యవసాయ అధికారి నాగం కృష్ణ తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఎరువులను ఎక్కువ ధరలకు విక్రయించినట్లు గుర్తించిన డీలర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశామని తెలిపారు. రైతులను ఇబ్బందులకు గురిచేసే విధంగా ధరల్లో హెచ్చుతగ్గులు చేస్తూ ఎరువుల విక్రయాలు జరిపితే లైసెన్సు రద్దుతో పాటు క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎరువుల కొనుగోలులో రైతులకు ఏవైనా అనుమానాలు ఉంటే వెంటనే మండల వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు. గ్రామ గ్రామాన రైతులకు అవగాహన కల్పించే కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు వినీత్ కుమార్, అఖిల్, మండలంలోని ఎరువుల డీలర్లు ఉన్నారు.

## గ్రామ సభల ద్వారా గ్రామాల అభివృద్ధి

### తహసీల్దార్, ఎంపిడిఒలు వెల్లడీ

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** గ్రామసభల ద్వారా గ్రామాలు అభివృద్ధి చెందుతాయని తహసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ రాజిరెడ్డి లు వెల్లడించారు. నిజాంపేట మండలం నస్కల్ , రాంపూర్ గ్రామలలో శనివారం గ్రామపంచాయతీ కార్యాలయల వద్ద ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా గ్రామసభలు నిర్వహించారు. గ్రామల లో వివిధ శాఖల వారీగా అంశాలపై చర్చించారు. వర్షాకాలం నేపథ్యంలో తీసుకోవలసిన జాగ్రత్తల పై ప్రజలకు సూచించారు. మంచినీటి సమస్యలు, నాలుగు రకాల తడి, పొడి చెత్తపై వర్షం నీరు వినియోగం గురించి, పారిశుద్ధ్యం, వ్యవసాయము, ఓటర్ జాబితా, పోలీస్ శాఖ ద్వారా డ్రంక్ అండ్ డ్రైవ్, సైబర్ క్రైమ్, ఓటీపీల ద్వారా మోసపోయే విధానాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాతీ అంజమ్మ లక్ష్మాగౌడ్, పొన్న బోయిన ప్రవీణ్, ఉప సర్పంచ్లు దేవరాజు, అనిల్, ఎస్ఐ రాజేష్, మిషన్ భగీరథ ఏఈ బిక్షపతి, కార్యదర్శి మమత, చంద్రహాసన్, ప్రదానోపాధ్యాయులు సత్యం రెడ్డి, ఏపీఓ శ్రీనివాస్, టిఏ మమత, ఏఈఓలు శ్రీలత, మౌనిక, రమ్య, డిబిఎఫ్ జిల్లా అధ్యక్షులు సంజీవ్, ఉపాధ్యాయులు, అంగన్వాడి టీచర్లు, ఆశా వర్కర్లు, విఏఓలు, వార్డు సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సహకారంతో మున్సిపాలిటీని అభివృద్ధి చేస్తా...

### మున్సిపల్ చైర్మెన్ గజవాడ లావణ్య నాగరాజు

**ప్రజాపక్షం/రామాయంపేట:** రామాయంపేట మున్సిపాలిటిని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు సహకారంతో అభివృద్ధి చేస్తామని మున్సిపల్ చైర్మెన్ గజవాడ లావణ్య నాగరాజు అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో బాగంగా శనివారం 10,11,12 వార్డులకు చెందిన సభలను వైశ్య భవనల్‌లో చైర్మెన్ అద్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా విద్యుత్ అధికారుల తీరుతో విసిగిపోతున్నామని స్థానికులు విద్యుత్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం చైర్మెన్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి వార్డు సభలు నిర్వహించడం జరుగుతుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే రోహిత్‌రావు ప్రత్యేక నిదుల మంజూరు చేశారని ఎండల కారణంగా నిలిచిపోయిన పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. వర్షాకాలం దృష్యా సీజనల్ వ్యాదులు రాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఇల్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వీదుల్లో చెత్త వేయకుండా మున్సిపల్ వాహనాలకు అప్పగించాలన్నారు. ప్లాస్టిక్ నివారణకు ప్రతి ఒక్కరు సహకరించి ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటిగా మార్చాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో వైస్ చైర్మెన్ పోచమ్మల నవనీత గణేష్, కమీషనర్ రవీందర్, కౌన్సిలర్లు గజవాడ నాగరాజు, గుగులోతు రవినాయక్, బైరం స్వప్న, దేవుని రంజిత్, మద్దెల మాదవి రమేష్, దాకి శ్యామల స్వామితో పాటు పలువురు పాల్గొన్నారు.

## విధుల ముగింపు...విషాదాంతం...

### రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి.......



**ప్రజాపక్షం/రామాయంపేట:** ఆయన నిరంతరం ప్రజారక్షణే ధ్యేయంగా పనిచేసే ఖాకీ. ఎప్పటిలాగే విదులను ముగించుకొని శుక్రవారం రాత్రి కన్నవారిని, కట్టుకున్న వారిని చూడాలనే ఆర్బాటంతో స్వగ్రామానికి బయలుదేరాడు. కానీ ఆ రాత్రి ఆయన జీవితంలో చివరి రాత్రి అవుతుందని ఊహించలేదు. రోడ్డు ప్రమాదం రూపంలో వచ్చిన మృత్యువు ఒక నిబద్దత గల పోలీస్ అధికారిని బలితీసుకుంది. ఈ విషాదకర సంఘటన శుక్రవారం రాత్రి మండలంలోని అక్కన్నపేట శివారులో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే...మెదక్ జిల్లా రామాయంపేట మున్సిపాలిటి పరిదిలోని కోమటిపల్లి గ్రామానికి చెందిన సంగెపు మహిపాల్ (40) శివ్వంపేట పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విదులు నిర్వహిస్తున్నాడు. విదులు ముగించుకొని ఇంటికి తిరుగుప్రయాణంలో రోడ్డు ప్రమాదంలో మృత్యువాతకు గురయ్యాడు. శనివారం ఆయన స్వగ్రామంలో కన్నీటి వీడ్కోలు మద్య అంత్యక్రియలు ముగిసాయి. మహిపాల్ అకాల మరణ వార్త వినగానే కోమటిపల్లి గ్రామం ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురైంది. పల్లె మొత్తం విషాద చాయలు అలుముకున్నాయి. ఆయన బౌతికకాయాన్ని చూసి కుటుంబ సభ్యులు, బందువులు రోదనలు అక్కడున్న వారిని కంటతడి పెట్టించాయి. తోటి కానిస్టేబుల్ మృతితో సహచర సిబ్బంది తీవ్ర మనోవేదనకు గురయ్యారు. మహిపాల్ మృతి చెందిన వార్త తెలుసుకున్న జిల్లా అడిషనల్ ఎస్‌పి విక్రంకుమార్ సింగ్, తూప్రాన్ డిఎస్‌పి నరేందర్‌గౌడ్, సిఐ సైదా, ఎస్ఐ బాలరాజులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మహిపాల్ విది నిర్వహణలో ఎంతో క్రమశిక్షణతో, సేవాభావంతో పనిచేసేవారని కొనియాడారు. ఆయన మృతి పోలీస్ శాఖకు తీరనిలోటని పేర్కొంటు వారి కుటుంబానికి తమ సానుభూతిని తెలిపారు. పోలీసు అధికారిక లాంచనాలతో మహిపాల్ అంత్యక్రియలు చేపట్టగా డిఎస్‌పి, సిఐ, ఎస్ఐలు పాడె మోశారు. మృతునికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు.

## నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం

**ప్రజాపక్షం/వెల్దుర్తి :** మెదక్ జిల్లా వెల్దుర్తి మాసాయిపేట మండలాల్లోనెల్లూరు నుంచి కొప్పులపల్లి కి వెళ్లే దారి లో కొప్పులపల్లి శివారులో వ్యవసాయ విద్యుత్ సరఫరా కు చెందిన 25 హెచ్పి నాలుగు విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లను బద్దలు కొట్టి వాటిలో గల కాపరు వైరును దొంగలు ఎత్తుకెళ్లారు. శనివారం ఉదయం పంట పొలాల వద్దకు వెళ్లిన రైతులు గమనించి మాసాయిపేట విద్యుత్ శాఖ ఇంజనీరు మనోహర్ కు సమాచారం అందించారు.

## మర్పిల్లి హోటల్ భవనంపై కప్పు కూలి నలుగురికి గాయాలు

**ప్రజాపక్షం/ సంగారెడ్డి :** వికారాబాద్ జిల్లా మర్పిల్లి మండల కేంద్రంలో ఉన్న హోటల్ భవనం పై కప్పు కూలి నలుగురు గాయపడిన ఘటనలో క్షతగాత్రులను సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో ఇద్దరు స్థానిక ప్రైవేటు ఆసుపత్రి కి వెళ్లారు. మిగిలిన ఇద్దరు సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మంత్రి దామోదర్ రాజనర్సింహా సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ ను ఆదేశించారు. ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మరో ఇద్దరి ఆరోగ్య పరిస్థితిపై డిఎంహెచ్ఓను మంత్రి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారికి మెరుగైన వైద్య సేవలను అందించేందుకు కృషి చేయాలని మంత్రి దామోదర్ రాజనర్సింహా కోరారు.

## బీరప్ప దేవాలయం నిర్మాణానికి శంకుస్థాపన

ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి



**ప్రజాపక్షం/రాంచంద్రాపురం :** రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని ఈఎస్ఐ ఆసుపత్రి సమీపంలో నూతనంగా నిర్మించ తలపెట్టిన బీరప్ప స్వామి దేవాలయం భూమి పూజ కార్యక్రమంతో పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్బంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణానికి సంపూర్ణ సహకారం అందిస్తానని హామీచ్చారు. స్థలం అంశంలో వివాదాలు తలెత్తకుండా బిహెచ్ఎల్ యాజమాన్యంతో చర్చిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పోరేటర్లు అంజయ్య, పుష్ప మహేష్, సీనియర్ నాయకులు పరమేష్ యాదవ్ ఐలేష్ ,రాజు, కురుమ సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఇబ్బంది లేకుండా జొన్నలు కొనుగోలు చేయాలి

చైర్మన్ రాజు యాదవ్

**ప్రజాపక్షం/రేగోడు:** వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో కొనుగోలు చేస్తున్న జొనులను రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోలు చేయాలని పిఎసిఎస్ చైర్మన్ రాజు యాదవ్ అన్నారు శనివారం రేగోడ్ లో జొన్నుల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు రేగోడ్ గజ్వడ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు కొనసాగుతున్నాయని అన్నారు రైతులకు జీలుగ విత్తనాలు 30 బస్తా ధర రూ.2460 ఉంటుందని అన్నారు పి ఎస్ ఎస్ కేంద్రంలో సిద్దంగా పంపిణీకి సిద్దంగా ఉన్నాయని అన్నారు

# బాల పంచాయతీలతో సమస్యలు పరిష్కారం

సమస్యల పరిష్కారంతో సురక్షిత గ్రామాలు

పిల్లల్లో నాయకత్వ లక్షణాల పెంపునకు వేదిక

బాలల భద్రతకు అందరూ తోడ్పడాలి

ఎస్పీ డి.వి.శ్రీనివాస రావు



**ప్రజాపక్షం/పాపన్నపేట :** తెలంగాణ రాష్ట్రంలో నిర్వహిస్తున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక99 రోజుల కార్యక్రమంలో భాగంగా బాలల భద్రత వారోత్సవాల సందర్భంగా శనివారం పాపన్నపేట మండలంలోని మంజీరా ఫంక్షన్ హాల్లో తెలంగాణ పోలీస్ విమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో, మై ఛాయస్ ఫౌండేషన్, యంగిస్తాన్ స్వచ్ఛంద సంస్థల సహకారంతో బాల పంచాయతీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణ, భద్రత, నాయకత్వ లక్షణాల అభివృద్ధికి బాల పంచాయతీలు సమర్థవంతమైన వేదికలుగా నిలుస్తాయని అన్నారు. గ్రామాల్లోని బాలబాలికల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుంటూ పనిచేసేలా బాల పంచాయతీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బాలల భద్రత, విద్య, ఆరోగ్యం, పరిశుభ్రత, బాల్య వివాహాల నివారణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన వంటి అంశాలపై బాల పంచాయతీ ప్రతినిధులు దృష్టి సారించాలని సూచించారు. గ్రామాభివృద్ధి, బాలల సంక్షేమంలో పిల్లలను భాగస్వాములను చేయడం ద్వారా వారిలో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని పేర్కొన్నారు. బాల పంచాయతీ సభ్యులు గుర్తించిన సమస్యలను అధికారులు సానుకూలంగా స్వీకరించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. బాలల అనుకూల వాతావరణం కల్పించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, సీడబ్ల్యూసీ చైర్మన్ ఉప్పలయ్య, డీసీపీఓ నాగరాజు, సీసీఎస్ సీఐ రాజశేఖర్ రెడ్డి, సీఐడీ ఉమెన్ సేఫ్టీ వింగ్ సీఐ రాజేష్, రూరల్ సీఐ జార్జ్, యంగిస్తాన్ ఫౌండేషన్ ప్రతినిధి వృత్విక, విజన్ ఎన్‌జీఓ ప్రతినిధులు రాజు, యాదగిరి, తహసీల్దార్ సతీష్, ఎంపీడీఓ విష్ణువర్ధన్, పీఎం శ్రీ పాపన్నపేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహేష్, నాయకులు శ్రీకాంత్ అప్ప, మాజీ సర్పంచ్ గురుమూర్తి గౌడ్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, బీజేపీ మాజీ మండల అధ్యక్షులు రాములు, కిష్టయ్య, నాయకులు శివయ్య, సంగమేష్, ప్రసాద్ గౌడ్, ప్రవీణ్ గౌడ్, వివిధ గ్రామాల విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి

:సిఐ ఎల్.పవన్ కూమర్

జిల్లా ఎస్పి శభరీష్ ఆదేశాలతో ప్రత్యేక కార్యక్రమాలు

గంజా నిర్మూలనకు విలేకరులకు అవాగహాన



**ప్రజాపక్షం/మరిపెడః** సమజాన్ని పట్టి పీడిస్తూన్న గంజాయి వంటి మహ్మారి నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అని మరిపెడ సీఐ ఎల్.పవన్ కూమర్ అన్నారు.జిల్లా ఎస్పి శభరీష్ ఆదేశాలతో శనివారం మరిపెడ పోలీస్ స్టేషన్లో ఆయన విలేకరులకు అవగహాన సమావేశం నిర్వహించి గంజాయి టెస్టింగ్ కిట్లను ప్రదర్శించారు.ఈ సందర్బంగా ఆయన మాట్లడుతూ మండల పరిదిలో గంజాయి పై పటిష్టమైన నిఘ ఉంచడం జరిగిందని,ఏవరైన అక్రమంగా గంజయిని తరలించడం,నిల్వ ఉంచడం,వ్యాపారం చేయడం,సేవించడం వంటి కార్యకలపాలకు పాల్పడినట్టయితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని,సమాజంలో కీలక పాత్ర పోషించే విలేకరులుగా చిన్న సమాచారం తెలిసిన తమ దృష్టికి తెవాలనీ విలేకరులను ఆయన కోరారు.అక్రమ సంపదన కోసం కోందరు గంజాయిని చాక్లేట్లు,ఐస్‌క్రీమ్‌లు వంటి వాటిలో కలిపి చిన్న పిల్లల నుండి యువకుల వరకు మత్తుకు బానిసలను చేసి వారి భవిష్యత్తును నాశనం చేస్తున్నరనీ అవేదన వ్యక్తం చేశారు.మత్తుకు బానిస అయిన వ్యక్తులు డబ్బుల కోసం అనేక నేరలు చేస్తు జైలుపాలు అవుతున్నరని అన్నారు.మత్తుకు బానిస అయిన వ్యక్తులు ఎవరైన స్వచ్ఛందంగా తమను సంప్రదించినట్టయితే వారిని,చుట్టు పక్కల ప్రాంతలలో ఎవరైన అటువంటి వ్యక్తులు ఉన్నట్లయితే వారి అచుకి తెలిపితే వారిని డి అడిక్షన్ సెంటర్ కు తరలించి వైద్యాసహాయం అందించి,మాములు వ్యక్తులు మరుటకు పోలీస్ శాఖ సహాయం చేస్తూందని అన్నారు.అనుమానం ఉన్న వ్యక్తి మూత్రం టెస్టింగ్ కిట్ల ద్వారా పరీక్షించి నిర్దరించుకోనే అవాకాశం ఉందనీ తెలిపారు.గంజాయి కి సంబంధించిన సమచారం 8712656999 నెంబర్ కి తెలపాలనీ,ఉపాయెగకరమైన సమాచారనికీ నగదు బహుమతి ఉంటుందనీ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్సై గుండ్రాతి సతీష్,సెకండ్ ఎస్సై మహబుబి,పోలీస్ సిబ్బంది,తదితరులు పాల్గోన్నారు.

# పచ్చిరొట్టి ఎరువుతో నేల సారం పెంపు

**రైతులకు జిలుగు, జనుము విత్తనాల అందుబాటు**



**ప్రజాపక్షం/గూడూరు:** వ్యవసాయ భూముల సారాన్ని పెంచి అధిక దిగుబడులు సాధించేందుకు రైతులు పచ్చిరొట్టి ఎరువులను వినియోగించాలని మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ మాలిక్ సూచించారు.ఈమేరుకు జిలుగు జనుము విత్తనాలు గూడూరు పిఎస్ఎస్ ఆగ్రోరైతుసేవాకేంద్రాల్లో రైతులకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.పచ్చిరొట్టి ఎరువుకోసం జనుము జిలుగు కౌపి వంటి పంటలను సాగుచేసి పుష్పదశకు చేరుకునే ముందు నేలలో కటపడం ద్వారా భూసారం గణనీయంగా పెరుగుతుందని పెర్కోన్నారు.ఈపద్ధతి వల్ల పేలలో సేంద్రియ పదార్థం పెరగడంతో పాటు నత్రజని వంటి ముఖ్య ఫోషకాలు అదికమవుతాయని వివరించారు.ముఖ్యంగా పుప్పుధాన్యాలకు చెందిన పచ్చిరొట్టి పటంటలు గాలిలోని నత్రజనిభూమిలో స్థిరపరచి రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.నేల నిర్మాణం మెరుగుపడి వేర్ల పెరుగుదల సులభమవడంతో పాటు నీటిని నిల్వ ఉంచుకోనే సామర్థ్యం కూడా పెరుగుతుందని చేప్పారు.పచ్చిరోటి పంటలు వేగంగా పెరగడం వల్ల కలుపు మొక్కల పెరుగుదల అణచివేయడమే కాకుండా నేలలో ఉపయోగకరమైన సూక్ష్మ జీవుల సంఖ్యను పెంచి పంటల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయని పేర్కోన్నారు.తద్వారా తదుపరి పంటల దిగుబడులు కూడా పెరిగే అవకాశముందని తెలిపారు. పచ్చిరొటి పంటలను 30 నుంచి 45 రోజుల వయస్సులో పూలు వచ్చే దశకు ముందే దున్ని నేలలో కటపడం ఉత్తమమని సూచించారు.విత్తనాలు పోందదలచిన రైతులు ఆధార్ కార్డు పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్ ప్రతులతో పిఎస్ఎస్ లేదా ఆగ్రోరైతు కేంద్రాలను సంప్రదించాలని కోరారు.జిలుగువిత్తనాల 30 కిలోల సంచి ధర రూ 2,452.50గా నిర్ణయించినట్లు మండల వ్యవసాయశాఖ అధికారి అబ్దుల్ మాలిక్ వెల్లడించారు.

## లక్డారం ప్రజా పాలన .. ప్రగతి ప్రణాళిక కార్యక్రమం



**ప్రజాపక్షం/పటాన్ చెరువు :** సంగారెడ్డి పటాన్‌చెరు నియోజకవర్గంలోనిఇస్నాపూర్ మున్సిపాలిటీలోని లక్డారం గ్రామంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం బాగంగా చైర్మన్ మోటీ సుమలత శ్రీకాంత్ యాదవ్ ఆద్వర్యంలో వార్డు సభ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ కమీషనర్ వెంకట కిషన్ రావు ఎమ్మార్వో ,సంబందిత శాఖల అదికారులు కౌన్సిలర్లు కో ఆప్షన్ సభ్యులు గ్రామస్థులు యువత మహిళలు ఘనంగా పాల్గొన్నారు. సభలో ప్రదానంగా గ్రామంలో నెలకొన్న మురుగునీరు సమస్యను అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ అమలులో వచ్చే తేది సమస్యలను తడి, పొడి చెత్త వేరు చేయడంపై అవగాహన కల్పించడం రాబోయే వర్షకాలంలో ఓంపు ప్రాంతాల్లో నీరు నిల్వకుండా తీసుకోవాలని చర్యల వంటి అంశాలపై చర్చ జరిగింది. చైర్మన్ మోటే సుమలత శ్రీకాంత్ యాదవ్ చెప్పారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు లక్డారం గ్రామంలోని 3 వార్డులో వార్డు సభలు నిర్వహించి ప్రజలకు శానిటేషన్ ,డ్రైనేజ్ వ్యర్థ నిర్వహణ పద్దతులపై స్పష్టమైన సమాచారం ఇవ్వడం జరుగుతుంది. సభలో ఉన్న అదికారులు గ్రామస్థుల ప్రశ్నలకు ప్రత్యక్షంగా సమదానాలు, ఇచ్చి సంబందిత శాఖల ఏ చర్యలు తీసుకునే పనులు షెడ్యుల్ ఏలా ఉంటుంది అన్నదానపై స్పష్టత నిచ్చారు. అంతేకాదు వచ్చే ఎన్నికల సందర్బంలో ఓటరు జాబితా మ్యాపింగ్ సవరణలు ,సెన్సస్ ప్రక్రియపై గ్రామ ప్రజలకు పూర్తి అవగాహన కల్పించడ జరిగింది. ముఖ్యంగా వృద్దులు మహిళలు,యువతకు సంబందించిన సూచనలు తీసుకుని వాటి అమలుకు ప్రముఖ అదికారులు బాద్యతలు, స్పష్టం చేశారు. చర్చలు ప్రజాప్రశ్నలపై అదికారులు తీసుకున్న సూచనలు త్వరలో అమలు చేయబోతున్నాయని గ్రామంలోని స్వచ్చత ,మౌళిక సదుపాయాల మెరుగుదలపై మున్సిపల్ అదికారులు కృషి చేస్తుందని తెలిపారు.

## రాజాకీయాలకు ఆతీతంగా గ్రామ అభివృద్ధికే మొదటి ప్రాధాన్యత

సర్పంచ్ నారెడ్డి కవిత సుదర్శన్ రెడ్డి



**ప్రజాపక్షం/మరిపెడః** రాజాకీయాలకు అతీతంగా గ్రామన్ని అభివృద్ధి చేయడమే నా మొదటి ప్రాధన్యత అని గాలివారి గూడెం గ్రామ సర్పంచ్ నారెడ్డి కవిత సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం మహబుబాబాద్ జిల్లా మరిపెడ మండలం గాలివారి గూడెం గ్రామంలో 99రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణళికలో భాగంగా నిర్వహించిన గ్రామ సభలో ఆమె మట్లడుతూ,ఈ కార్యక్రమం ద్వారా గ్రామంలోని ప్రతి సమస్య ను గుర్తించి వాటి పరిష్కరానికీ కృషి చేస్తామని అన్నారు.రాజాకీయలకు అతీతంగా గ్రామఅభివృద్ధికి మొదటి ప్రాదన్యత ఉంటుందని అన్నారు.ప్రజలందరి సహకారంతో గాలివారి గూడెం గ్రామన్నీ అన్ని రంగల్లో ఆదర్శంగా తీర్చిదిద్దడమే తన లక్షమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మరిపెడ ప్రభుత్వ వైద్యులు డాక్టర్ రవి నాయక్ వ్యాదులు,వాటి నివరణ,ఆరోగ్య పరిరక్షణ పై అవగహన కల్పించారు.ఐసిడిఎస్ సుపర్ వైజర్ ఉషా మట్లడుతూ మహిళలు,గర్భిణిలు,బాలింతలు,చిన్న పిల్లలలో రక్తహినత,పోషకహార లోపం నివారించాడనికీ పౌష్టికాహారం ఎంతో అవసరం ఉందని అవగహన కల్పించారు.ప్రభుత్వ అంగన్‌వాడి సెంటర్ సేవలు సద్వినియోగం చేసుకోవలనీ గ్రామస్తూలను కోరారు.ఇంజనిరింగ్ అధికారులు గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనుల వివరలను ప్రజలకు తెలిపారు.అనంతరం అందరు కలసి గ్రామ పంచాయితి భవనం ప్రక్కన ఒక మొక్కను నాటరు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, కార్యదర్శి, అంగన్‌వాడి టిచర్లు, ఆశ కర్యకర్తలు, గ్రామ పెద్దలు, ప్రజలు, తదితరులు పాల్గోన్నారు.

## మేఘనాథ్ కుటుంబాన్ని పరామర్శించిన హరీశ్‌రావు

ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్: సిద్దిపేట అర్బన్ మండలం మందపల్లి గ్రామానికి చెందిన పాల కేంద్రం మాజీ అధ్యక్షుడు మేఘనాథ్‌రెడ్డి ఇటీవల మృతి చెందగా శనివారం వారి కుటుంబ సభ్యులను మాజీ మంత్రి, ఎంఎల్‌ఏ తన్నీరు హరీశ్‌రావు పరామర్శించారు. అలాగే పంజల నర్సింహారెడ్డి కుటుంబాన్ని మాజీ మంత్రి,ఎంఎల్‌ఏ తన్నీరు హరీశ్‌రావు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ అరవిందరెడ్డి,సోమిరెడ్డి,గ్రామ సర్పంచ్ అర్చన, నాయకులు చంద్రకాంత్,రెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బానుచందర్ తదితరులు పాల్గొన్నారు.

## రైతు కనకయ్య మృతికి కాంగ్రెస్ ప్రభుత్వమే బాధ్యత

హరీష్‌రావు

ప్రజాపక్షం/సిద్దిపేట: రైతు కనకయ్య మరణం ప్రభుత్వ హత్యే అని మాజీ మంత్రి బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీష్ రావు అన్నారు. రైతుల కష్టాలను పట్టించుకోకుండా ప్రభుత్వం రాజకీయాలకే పరిమితమైందన్నారు. సిద్దిపేట నియోజకవర్గం నా రాయనరావుపేట మండలం కేంద్రంలో గుండెపోటుతో మృతి చెందిన పల్లెవేని కనకయ్య మృతి పై ఎమ్మెల్యే తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కనకయ్య మృత దేహానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రైతు కనకయ్య మృతికి కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు చేసిన ఒక్క మంచి చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎరువుల సరఫరా మొదలు కొనుగోళ్ల వరకు ఫెయిల్ అయ్యారని విమర్శించారు. అధికారులు మంత్రులు రైతులను పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని 45 రోజులుగా కొనుగోలు చేయకుండా కాలయాపన చేయడంతో వర్షాలకు తడిసి భారీ నష్టం వాటిల్లిందని అన్నారు. తడిసిన వడ్లను కొనుగోలు చేయాలని వేడుకున్న రైతులకు కోతలు విధించడం దారుణమని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం ప్రకటనలకే పరిమితమైందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఎదురుచూస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని, వర్షాలతో ధాన్యం తడిసి పోయిన అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. మరణించిన కనకయ్య కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని,ఎలాంటి కోతలు లేకుండా రైతుల ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

## ఉల్లాసంగా సమ్మర్ క్యాంప్ క్రికెట్ టి 20 లీగ్ టోర్నమెంట్

ప్రజాపక్షం/మహబూబాబాద్ : గత నెల రోజులుగా హైదరాబాద్ క్రికెటర్ అసోసియేషన్ హెచ్‌సిఏ ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ డిస్ట్రిక్ క్రికె అసోసియేషన్ (డబ్ల్యుడిసిఏ) సహకారంతో మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో జరుగుతున్న సమ్మర్ క్రికెట్ క్యాంప్ క్రీడాకారులకు శనివారం మహబూబాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంప్ క్రికెట్ టి20 టోర్నమెంట్ ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మహబూబాబాద్ క్రికెట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బి అజయ్ సారథి రెడ్డి మాట్లాడుతూ గత నెల రోజులుగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో జరుగుతున్న సమ్మర్ క్రికెట్ క్యాంప్ లో క్రీడాకారులకు క్రికెట్ క్రీడా మెలకువలను నేర్పించడం జరిగిందన్నారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు ఎదిగే విధంగా వారిని తయారు చేయడం జరుగుతుందని మరింత మెలకువలు నేర్చుకుని వారిలో ప్రతిభను వెలికి తీసేందుకు నేటి నుండి సమ్మర్ క్యాంప్ క్రికెట్ టి20 లీగ్ టోర్నమెంట్ ను ప్రారంభించడం జరిగింది అన్నారు. భవిష్యత్తులో వివిధ టోర్నమెంట్ లో, జిల్లాల స్థాయి, రాష్ట్ర



స్థాయి, జాతీయ స్థాయికి, ఎదిగే విధంగా మంచి ప్రతిభను కనబరుస్తున్నారన్నారు. ఈ సందర్భంగా వందలాదిమంది క్రీడాకారులు ఈ క్యాంపులో పాల్గొని నెల రోజుల గా దిగ్విజయంగా సాగుతోందని, భవిష్యత్తులో కూడా ఈ క్యాంపు కొనసాగుతుందన్నారు సమ్మర్ క్యాంప్ క్రికెట్ టీ20 టోర్నమెంట్ లో జిల్లా క్రీడల అధికారి డిఎస్ఓ జ్యోతి, క్రికెట్ అసోసియేషన్ చీఫ్ కోచ్ మెతుకు కుమార్, సహాయ కోచ్ లు తోట వినయ్, సాధ్విత్ రెడ్డి, క్రీడాకారులు అనిర్వేశ్, పిట్టల శ్రావణ్, పరమేశ్వర్, హేమంత్ రెడ్డి, చరిత్ రెడ్డి, నీలం వెంకటేశ్వర్లు, జైనీల్, ధర్మచరన్ రెడ్డి, తరుణ్, మనీష్, అవినాష్, వెలుగు శ్రవణ్ పాల్గొన్నారు.

## ప్రైమరీ పిఎంసిల నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

అంగన్‌వాడీ యూనియన్ డిమాండ్

ప్రజాపక్షం/గూడూరు: ప్రభుత్వం తీసుకున్న ప్రీ ప్రైమరీ పీఎంసీల(పియంసిఎస్) నియామక నిర్ణయాన్ని వెంటనే రద్దు చేసి ప్రీ ప్రైమరీ విద్య నిర్వహణను పూర్తిగా ఐసీడీఎస్ పరిధిలోనే కొనసాగించాలని అంగన్‌వాగీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి పగిడిపాల తిరుపతక్క డిమాండ్ చేశారు.శనివారం వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ స్థానిక తహశీల్దార్ మండల విద్యాశాఖ (ఎంఈఓ) సీడిపిఒ కార్యాలయాలకు యూనియన్ ప్రతినిధులు వినతిపత్రాలు సమర్పించారు.ఈసందర్భంగా తిరుపతక్క మాట్లాడుతూ చిన్నారుల సమగ్ర అభివృద్ధికి ఐసిడిఎస్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అంగన్‌వాడి టీచర్లు హెల్పర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని ఆమే కోరారు.ప్రతి నెల మొదటి వారంలోనే వేతనాలు చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



సుప్రీం కోర్టు తీర్పుప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేసి కనీస వేతనం రూ 26000 చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం అంగన్‌వాడి సిబ్బంది తక్కువ వేతనాలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారికి ఉద్యోగ భద్రత పీఎఫ్ వంటి సామాజిక భద్రతా సౌకర్యాలు కల్పించాలని కోరారు.ప్రభుత్వం అంగన్‌వాడి సిబ్బంది సమస్యలను సానుకూలంగా పరిశీలించి వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.ఈకార్యక్రమంలో ప్రాజెక్టు అధ్యక్షురాలు జక్కుల మంగమ్మ కార్యదర్శి పెనుక భారతి పారిజాతం స్వరూప జ్యోతి అనిత లక్ష్మీ మంగ సుశీల రజిత తదితరులు పాలోగన్నారు.

## పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాపక్షం/తొర్రూరు : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 12వేల గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న అరవై వేల మంది కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కొత్తపల్లి రవి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.అరుణ్‌కుమార్ అన్నారు. హైదరాబాద్‌లోని మార్క్స్ భవన్‌లో జరిగిన ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పలు తీర్మాణాలను చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన కనీస వేతనాల జీవోలో గ్రామ పంచాయతీ కార్మికులను ఎందుకు చేర్చలేదని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్లక్ష్యానికి నిరసనగా ఈ నెల 8 నుంచి 22 వరకు గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో గ్రామ పంచాయతీ కార్మికులు పెద్ద ఎత్తున నిరసన చేపట్టాలని పిలుపునిచ్చారు. పంచాయతీ కార్మికుల శ్రమతో రాష్ట్రంలో ప్రభుత్వానికి అనేక అవార్డులు, రివార్డులు వస్తున్నాయని, పేరు ప్రఖ్యాతలు పెరగడం కేవలం కార్మికుల శ్రమతోనే అన్న విషయాన్ని విస్మరించారని అన్నారు. ఇటీవల విడుదల చేసిన జీవో నెంబర్‌లో మూడు విభాగాల్లో గ్రామ పంచాయతీ సిబ్బందిని ఎందుకు చేర్చలేదని ప్రశ్నించారు. జీవో నెంబర్ ప్రకారం కనీస వేతనాలను గ్రామ పంచాయతీ




కార్మికులకు ఇవ్వాలన్నారు. టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షులు కె.సూర్యం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నాయని అన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని 2016లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు గ్రామ పంచాయతీ కార్మికులకు ఎందుకు ఇవ్వడం లేదన్నారు. పంచాయతీ కార్మికులతో పాటు ఇతర రంగాల కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలన్నారు. అనంతరం పంచాయతీరాజ్ జాయింట్ కమిషనర్ సుధాకర్‌కు ప్రతినిధి బృందంగా వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొందరలోనే డిమాండ్లను పరిశీలించి పరిష్కరించడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర నాయకులు ఏదుట్ల కురుమయ్య, పొద్ద బీకు, గోవిందమ్మ, గట్టమ్మ తదితరులు పాల్గొన్నారు.

## తొర్రూరును ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం

తొర్రూరు మున్సిపల్ చైర్మన్ తూనం శ్రావణ్‌కుమార్

ప్రజాపక్షం/తొర్రూరు : పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి సహకారంతో తొర్రూరును అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని మున్సిపల్ చైర్మన్ తూనం శ్రావణ్‌కుమార్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని 4,5,6,7,8వ వార్డుల్లో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ తొర్రూరు పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంతో పాటు ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. పలు వార్డుల్లో ప్రజల సమస్యలు, అవసరాలను, అభివృద్ధికి సంబంధించిన సూచనలు నేరుగా ప్రజల నుంచి తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు ప్రణాళికలు రూపొందించి కృషి చేయడం జరుగుతుందన్నారు. ప్రజల భాగస్వామ్యంతో పట్టణంలో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందిస్తామన్నారు. ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి సహకారంతో నిధులు కేటాయించి అన్ని వార్డులను అభివృద్ధి చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సోమ రజిని రాజశేఖర్, మున్సిపల్ కమిషనర్ వి.శ్యాంసుందర్, వార్డు కౌన్సిలర్లు చాపల బాపురెడ్డి, పెదగాని కళావతి సోమయ్య, పేర్ల జంపన్న, మాద్గుల భవానిలత, అల్లం శ్యామల, ఆరోగ్య, విద్యా, వైద్య శాఖల అధికారులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## కొనుగోలు కేంద్రంలో అవకతవకలపై తహసీల్దార్‌కు ఫిర్యాదు

ప్రజాపక్షం/మరిపెడ: తెలంగాణ ప్రభుత్వం ఐకెపి అధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రలలో అవకతవకలు జరిగయని రైతులు తాసిల్దార్ కు ఫిర్యాదు చేసిన ఘటన మరిపెడ మండల పరిధిలో శనివారం చోటుచేసుకుంది.స్థానిక రైతులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని తాళ్ళఊకల్ గ్రామంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులు ఇష్టరీతిగా వ్యవహరిస్తు కాంటాలు వెస్తు,తరుగు తీస్తు,రైతుకు ఆర్థికంగా నష్టం జరుగుతుందని అవేదన వ్యక్తం చేశారు.కోనుగోలు కేంద్రంలో అవకతవకలపై మరిపెడ తాసిల్దార్ కు ఫిర్యాదు చేశామని అన్నారు.సదరు అంశంపై కోనుగోలు కేంద్రం నిర్వాహకులను విలేకరులు వివరణ కోరగా అటువంటిది ఎమిలేదని,ఎటువంటి అవకతవకలు జరుగలేదని 200 మంది రైతుల వద్ద దాన్యం కోనుగోలు చేసిన పూర్తి రికార్డులు ఉన్నయని,కోందరు దళరుల దాన్యం కోనుగోలు కేంద్రంలోలోకి అనుమతించకపోవడం,కోందరు రాజకీయ నాయకులకు సహకరించకపోవడం కారణంగా వారి ప్రోద్భలంతో కోందరు పనికట్టుకోని తప్పుడు అరోపనలు చేస్తున్నరని,మహిళలు అని చూడకుండా బెదిరింపులకు పాల్పడుతున్నరని విలేకరుల ముందు వాపోయారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

ప్రజాపక్షం/తొర్రూరు : ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందుతుందని మండలంలోని చీకటాయపాలెం గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొలుపుల శ్రీనివాస్ అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో చిన్నారులను పాఠశాలకు పంపించేందుకు ఉపాధి కూలీల వద్దకు శనివారం చేరుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయ బృందం, గ్రామ సర్పంచ్ చిదిరాల కృష్ణమూర్తి, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు కలిసి మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న చంద్రుకుంట దగ్గరికి వెళ్లి తల్లిదండ్రులతో, గ్రామస్తులతో ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలను వివరిస్తూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే విధంగా అవగాహన కల్పించారు. నర్సరీ నుండి ఏడవ తరగతి వరకు ఆంగ్ల మాధ్యమంలో బోధన జరుగుతుందన్నారు. తల్లిదండ్రులు స్పందిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లోనే తమ పిల్లలను చేర్పిస్తామని చెప్పారు.

## వార్డు సమస్యలు పరిష్కరించాలి

ప్రజాపక్షం/తొర్రూరు : మున్సిపల్ పరిధిలోని ఆరవ వార్డులో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ తొర్రూరు మున్సిపల్ చైర్మన్ తూనం శ్రావణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్‌లకు వినతి పత్రాన్ని యువజన నాయకులు అందజేశారు. పురపాలక సంఘం తొర్రూరు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శనివారం యతిరాజారావు పార్కులో వార్డు సభను ఏర్పాటు చేశారు. ఆరవ వార్డు అంబేద్కర్ నగర్‌లో ఉన్న ఎంపీపీఎస్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేనందున అదనపు తరగతి గదులు నిర్మించాలని, అంబేద్కర్ నగర్‌లో పలు కాలనీలో విద్యుత్ స్తంభాలు, సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజీల నిర్మాణం, నీటి సమస్య, ఇతర మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువజన నాయకులు మంగళపల్లి యాకయ్య, అంబేద్కర్ సంఘం మండల, పట్టణ అధ్యక్షులు రాయిశెట్టి యాకేందర్, మంగళపల్లి సుధాకర్, మాజీ అధ్యక్షులు మంగళపల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రం ప్రకటించిన మద్దతు ధరలపై సంయుక్త కిసాన్ మోర్చా నిరసన

ప్రజాపక్షం/మహబూబాబాద్ : డోర్నకల్ మండల కేంద్రంలో సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో మసీద్ సెంటర్లో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో కాపీలను శనివారం దగ్ధం చేశారు. అనంతరం జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి శెట్టి వెంకన్న, జిల్లా అధ్యక్షులు నెల్లూరు నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రం పెంచిన మద్దతు ధర సాగు పెట్టుబడులకు అతీతంగా ఉందన్నారు. పెరిగిన ఎరువులు విత్తనాలు డీజిల్ ధరలతో వ్యవసాయం భారంగా మారిందని, ఉపాధి లేక కూలీలు పట్టణాలకు వలస పోతున్నారని, తక్షణమే ప్రభుత్వం స్వామినాథన్ కమిషన్ సూచనల మేరకు పెరిగిన పెట్టుబడులకు అనుకూలంగా ఎం ఎస్ పి గ్యారెంటీ మద్దతు ధర అందించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దాసరి మల్లేష్, ఎల్లావుల నరసింహారావు, కుదిరిపాక ప్రవీణ్, కోటమర్తి ప్రభాకర్, వీరన్న, పాపయ్య తదితరు రైతులు పాల్గొన్నారు.